మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

1

నవతెలంగాణ

శుక్రవారం 25 ఆగస్టు 2023




ఎస్ఎఫ్ఐ ప్లీనరీ స్టిక్కర్స్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సంగారెడ్డి: సెప్టెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయాలని ప్లీనరీ సమావేశాల స్టిక్కర్స్ పోతిరెడ్డిపల్లి సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల చైర్మన్ ఆంటోనీ చేతుల మీదుగా గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంథోనీస్ విద్యాసంస్థల చైర్మన్ ఆంథోని మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యార్థుల సమస్యలతో పాటు సమాజం మార్పు కోసం కృషి చేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు సంగారెడ్డిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా సమాజం విద్యారంగం సమూల మార్పు, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసం ఈ సమావేశాలు జరుగుతున్నాయని, విద్యార్థులు మేధావులు శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్ష ఎర్రోళ్ల మహేష్ జిల్లా కమిటీ రవి కిరణ్ గౌడ్ శ్రీకాంత్ వివేక్ ఉన్నారు.

కారులో అసమ్మతి సెగలు

- మాకొద్దీ అభ్యర్థి అంటు నిరసనలు
- నర్సాపూర్‌లో మదన్‌రెడ్డి మద్దతుదారుల ధర్నా
- పటాన్‌చెరులో నీలం మధు అనుచరుల ఆందోళన
- అందోల్‌లో క్రాంతికి వ్యతిరేకంగా.. సమాలోచనలు
- మెదక్‌లో మైనంపల్లి గ్రూపు బీఆర్ఎస్‌కు దూరం



బీఆర్ఎస్‌లో అసమ్మతి సెగలు రగులుతున్నాయి. అభ్యర్థుల ప్రకటనతో బీఆర్ఎస్‌లో ఉన్న గ్రూపుల లొల్లి తారా స్థాయికి చేరింది. ప్రకటించిన అభ్యర్థులు మాకొద్దు అంటూ నిరసనలకు దిగుతున్నారు. తమ నాయకుడికే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పార్టీపై తిరుగుబాటు తప్పదని హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో తొమ్మిది మంది అభ్యర్థుల్ని ప్రకటించారు. నర్సాపూర్ పెండింగ్‌లో పెట్టారు. ప్రకటించిన అభ్యర్థులకు సగం మంది వరకు స్వంత పార్టీలోనే వ్యతిరేకతను చవిచూస్తున్నారు. రోడ్లెక్కి పార్టీ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో తొమ్మిది స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించారు. నర్సాపూర్ పెండింగ్‌లో పెట్టారు. గజ్వేల్, సిద్దిపేట మినహా ఎనిమిది నియోజకవర్గాల్లోనూ టికెట్ రేసులో చాలా మంది ఉన్నారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు మరో నలుగురైదుగురు ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నించారు. జనాదరణ ఉంటే చాలు టికెట్ వస్తుందన్న నమ్మకంతో ప్రజల్లో చొరబడి పనిచేస్తూ వచ్చిన వాళ్లను సైతం పట్టించుకోకుండా సీఎం కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలను మళ్లీ అభ్యర్థులుగా ప్రకటించారు. దీంతో టికెట్ కోసం ఇన్నాళ్లు ప్రయత్నించి భంగపడ్డ ఆశావాహులందరూ అధినేత నిర్ణయం పట్ల అయిష్టతను వ్యక్తం చేస్తున్నారు. మైనంపల్లి హనుమంతారావు మంత్రి హరీశ్‌రావును టార్గెట్ చేస్తూ ఘాటైన విమర్శలు చేయగా ఇంకొందరేమో డెట్‌లైన్ పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్నారు.

మదన్‌రెడ్డికే టికెటివ్వాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికే తిరిగి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. తొలి జాబితా నర్సాపూర్ అభ్యర్థి పేరు ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టడంతో మదన్‌రెడ్డికి టికెట్ రాదన్న సంకేతాలొచ్చాయి. దీంతో మూడు రోజులుగా ఏదో రూపంలో నర్సాపూర్ నియోజకవర్గంలో మదన్‌రెడ్డి అనుచరుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సీఎం సభ ముగియగానే ఏకంగా రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇంటి వద్ద మదన్‌రెడ్డి మద్దతుదారులు ధర్నా చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డికి టికెట్ ఇస్తున్నట్టు లీకేజీలొస్తుండడంతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అనుచరుల్లో ఆందోళన ఎక్కువవుతోంది. అందుకే తమ నాయకుడైన మదన్‌రెడ్డికే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కుతున్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ మదన్‌రెడ్డి అనుచరులు వివిధ రూపాల్లో నిరసనలు తెలపాలని చూస్తున్నారు. నర్సాపూర్ టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికే ఇవ్వాల్సి ఉన్నా ఎందుకు పెండింగ్‌లో పెట్టారో చెప్పాలంటూ నిలదీస్తున్నారు. మదన్‌రెడ్డి అనుచరుల డిమాండ్‌కు తలొగ్గి ఆయనకే టికెట్ ఇస్తారా..? లేక ముందే అనుకున్నట్టుగా సునీతాలక్ష్మారెడ్డికిస్తారో..? వేచి చూడాలి.



పటాన్‌చెరులో భగ్గుమంటోన్న అసమ్మతి

పటాన్‌చెరు బీఆర్ఎస్‌లో అసమ్మతి భగ్గుమంటోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికే టికెట్ ఇవ్వడంతో నీలం మధుముదిరాజ్ తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. నాలుగేళ్లుగా టికెట్ ఆశించి పార్టీ కోసం ఎంతో చేసినా అధిష్టానం గుర్తించకపోవడంతో ఆయన అనుచరులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బుధవారం సీఎం మెదక్‌లో పర్యటించేందుకు పటాన్‌చెరు నియోజకవర్గం మీదుగా బస్సులో వస్తున్న వేళ నీలం మధుకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆయన అనుచరులు, మద్దతుదారులు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. గురువారం వేలాది మంది కార్యకర్తలు, అనుచరులు, అభిమానులతో ప్రత్యేక సమావేశమ్యారు. నియోజకవర్గంలో 70 వేల మంది ముదిరాజ్‌లున్నందున మధుకే టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. విదేశాల నుంచి కేటీఆర్ తిరిగి వచ్చే వరకు వేచిచూసే టికెట్ మార్చకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని యోచిస్తున్నారు.

జహీరాబాద్‌లో ఢిల్లీ వసంత్ అలక

జహీరాబాద్ ఎస్సీ రిజర్వుడ్ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మాణిక్యరావుకే టికెట్ ఇచ్చారు. దీంతో ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన ఢిల్లీ వసంత్ అలకబూనారు. ఎమ్మెల్యే టికెట్ ఇస్తారన్న ఆశతోనే వసంత్ బీఆర్ఎస్‌లో చేరారు. ఎన్నో ఏళ్లుగా సామాజిక ఉద్యమాలు చేస్తూ నియోజకవర్గంలో పట్టు కల్గి ఉన్నారు. ఈ సారి ఎన్నికల బరిలో దిగేందుకు సిద్దమ వ్వగా అధిష్టానం టికెట్ ఇవ్వడానికి నో చెప్పడంతో వసం త్ అసంతృప్తికి గురయ్యారు. రెండు మూడు రోజుల్లో ఆయన అసమ్మతిని వెల్లగక్కే అవకాశముంది. నరోత్తం కూడా టికెట్ ఆశించే పార్టీలో చేరినా ఆయనకు కూడా నిరాశ తప్పలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఒకే ఉప కులానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్న అపవాదు ఉంది.

మెదక్‌లో మైనంపల్లి మంటలు

మెదక్ టికెట్ ఆశించిన మైనంపల్లి రోహిత్ బీఆర్ఎస్‌కు దూరమయ్యారు. అభ్యర్థుల్ని ప్రకటించిన మరుసటి రోజున్నే రోహిత తండ్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతా రావు మంత్రి హరీశ్‌రావుపై తీవ్రమైన విమర్శలు చేశారు. పద్మాదేవేందర్‌రెడ్డికి టికెట్ ఇవ్వడాన్ని తప్పుపట్టారు. నియోజకవర్గమంతా అసమ్మతి గ్రూపు సమావేశమై పద్మాదేవేందర్‌రెడ్డి మాకొద్దు అంటూ నిరసన తెలిపారు. 23న జరిగిన సీఎం కేసీఆర్ సభకు మైనంపల్లి అనుచరులెవ్వరూ రాలేదు. దీంతో మైనంపల్లి తండ్రికొడుకులు బీఆర్ఎస్‌కు దూరమైనట్లేనని చెబు తున్నారు. మెదక్ నియోజకవర్గమంతటా వారి అనుచరులు కూడా బీఆర్ఎస్‌కు దూరమవుతున్నారు.

అందోల్‌కు గుప్పుమంటోన్న అసమ్మతి

అందోల్ అభ్యర్థిగా ఎమ్మెల్యే చంటిక్రాంతికిరణ్ పేరును ప్రకటించడంతో నియోజకవర్గంలో ఆయన వ్యతిరేకులు అసమ్మతిని వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీటీసీ రమేష్ ఎంతో కాలంగా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. చంటిక్రాంతిపై తీవ్రమై వ్యతిరేకత ఉన్నందున బీఆర్ఎస్ గెలవాలంటే తనకే టికెట్ ఇవ్వాలని కోరుతూ వచ్చారు. ఓ అధికారి కూడా టికెట్ కోసం ప్రయత్నించారు. వీరంతా కూడా క్రాంతికి వ్యతిరేకంగా సమాలోచనలు జరుపుతున్నారు. సంగారెడ్డిలో పట్నం మాణిక్యం, పులిమామిడి రాజు, ఆత్మకూర్ నగేష్, డాక్టర్ శ్రీహరి టికెట్ ఆశించారు. చింత ప్రభాకర్‌కే ఇవ్వడంతో వీరంతా తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రస్తుతానికి సైలెంట్‌గా ఉన్నా చింతకు ఏ మేరకు మద్దతుగా నిలుస్తారో చూడాలి.

జనగామలో పల్లా కుట్రలు చెల్లవు

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి.
- కేసీఆర్ మూడవసారి ముఖ్యమంత్రి కావాలని ముడుపు

నవ తెలంగాణ కొమురవెల్లి

జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి కుట్ర రాజకీయాలు చెల్లవని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. గురువారం చేర్యాల నుంచి కొమురవెల్లి మల్లన్న ఆలయం వరకు సుమారు 500 బైక్‌లతో ర్యాలీగా వచ్చి మల్లన్న ఆలయంలోని గంగిరేగి చెట్టు వద్ద మోకాళ్లపై కూర్చొని సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ కార్యకర్తలతో కలిసి గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టి మల్లన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి కుట్రపూరిత రాజకీయాలు చేయడం సిగ్గు చేటని అన్నారు. ఉద్యమ సమయంలో కనిపించని పల్ల రాజేశ్వర్ రెడ్డి జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే సీటు కోసం నీచ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఉద్యమ సమయంలో ఎక్కడ కానరాలేదని, చెప్పారు. ఏడు సంవత్సరాలు పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ఒక్క రూపాయి నిధులు కూడా జనగామ నియోజకవర్గానికి కేటాయించలేదని విమర్శించాడు. స్థానిక ఎమ్మెల్యేను కాదని ప్రగతి భవన్ వేదికగా జనగామ నియోజకవర్గం పై కుట్రలు చేస్తున్నాడని, స్థానిక ప్రజా ప్రతినిధులను డబ్బులు పెట్టి కొనడంపై తీవ్రంగా మండిపడ్డాడు. పల్లా రాజేశ్వర్ రెడ్డి చేస్తున్న కుట్ర రాజకీయాలు బీఆర్ఎస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించాడు. పల్లా రాజేశ్వర్ రెడ్డి నీవు నడుపుతున్న కాలేజీ జాగా నీ సొంత సోదరి ది కాదా అని పల్లాను నేరుగా ప్రశ్నిస్తున్నానని, నీ సోదరిని మోసం చేసి ఆమె పిల్లలు అమెరికా నుండి పంపిన డబ్బులతో కాలేజీ జాగను కొని నీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకొని కాలేజీ జాగా నాదేనని ఆమెను మోసం చేసింది నిజం కాదా అని విమర్శలు చేశారు. నీ కబ్జాల బాగోతం సమాజం మొత్తం చూసిందని పల్ల రాజేశ్వర్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశం గౌడ్, వైస్ చైర్మన్ పుర్మ వెంకట్ రెడ్డి, కొమురవెల్లి, చేర్యాల ఎంపీపీలు తలారి కీర్తన, కరుణాకర్, జడ్పిటిసి సిలువేరు సిద్ధప్ప, చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, టెంపుల్ చైర్మన్ గీస భిక్షపతి, బిఆర్ఎస్ మద్దూర్ మండల అధ్యక్షులు మేక సంతోష్ తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టికెట్ తనకే కేటాయించాలి



మంత్రి ఇంటిముందు కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బైఠాయింపు

నవ తెలంగాణ నర్సాపూర్

వచ్చే ఎన్నికల్లో నర్సాపూర్ అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకే టికెట్ కేటాయించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి నర్సాపూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి హైదరాబాదులోని మంత్రి హరీశ్‌రావు ఇంటిముందు మూడు గంటల పాటు బైఠాయించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ నర్సాపూర్ అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి టికెట్ కేటాయించాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి కాకుండా వేరే వ్యక్తికి టికెట్ కేటాయిస్తే నర్సాపూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులం, నాయకులం, కార్యకర్తలం అందరం ముక్కుమ్మడిగా రాజీనామా చేస్తామని తేల్చి చెప్పారు. మంత్రి హరీశ్‌రావు స్పందిస్తూ ఈ విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, జడ్పి కోఆప్షన్ సభ్యులు మనసూర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్ గౌడ్, లకావత్ రమేష్ నాయక్ ,హబీబ్ ఖాన్, శివంపేట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ పాల్గొన్నారు.

మళ్లీ ఉద్యమ బాటలో ఢిల్లీ వసంత్?

ఆశ నిరాశ కావడంతో సమాలోచనలో నరోత్తం బృందం

నవతెలంగాణ జహీరాబాద్





సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ బీఆర్ఎస్ పార్టీ టికెట్ తనకే వస్తుందని మూడు సంవత్సరాలుగా జహీరాబాద్ నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశారు. వై.నరోత్తంకు ముఖ్యమంత్రి ఆహ్వానించడంతో కాంగ్రెస్ పార్టీ వదిలి బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. ఇద్దరిని కాదని ప్రస్తుత శాసనసభ్యులు మాణిక్‌రావుకే ముఖ్యమంత్రి కేసీఆర్ టికెట్ కట్టబెట్టడంతో ఇరువర్గాల్లో నైరాశ్యం నెలకొంది. కాంగ్రెస్ పార్టీలో 10 సంవత్సరాలుగా గీతారెడ్డికి.. లేకపోతే తనకే టిక్కెట్ వస్తుందని కార్యకర్తలందరినీ కలుపుకొని నియోజకవర్గంలో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టిన నరోత్తం కాంగ్రెస్ పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకునిగా పేరుగాంచారు. నియోజకవర్గంలోనే తనకంటూ ప్రత్యేక బలాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

గతంలో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓటమిని చవిచూసిన నరోత్తం తదుపరి ఎన్నికల్లో గీతారెడ్డికి మద్దతు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితిల్లో తాను శాసనసభకు పోటీ చేస్తానని దృఢనిశ్చయంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామీణ స్థాయి నాయకులను సైతం బీఆర్ఎస్ పార్టీలో చేర్పించేందుకు శాయశక్తుల్లా కృషి చేశారు. టిక్కెట్ లభించకపోవడంతో నరోత్తం మద్దతుదారులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. కార్యకర్తలు సమావేశాలు నిర్వహించి సమాలోచనలు చేస్తున్నారు. ఢిల్లీ వసంత్ చివరికి బీఆర్ఎస్ కాండువాను పక్కనపెట్టి ఇతర పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సన్నిహిత వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే బీఆర్ఎస్ కండువాను తీసేసి మీడియాకు ఫొటోలు కూడా పంపించారు. నిన్నటి వరకు అధికార పార్టీలో చేరేందుకు బారులు తీసిన నాయకులు ప్రస్తుతం కాంగ్రెస్ వైపు దృష్టి మరల్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల నాటికి జహీరాబాద్ రాజకీయం ఎన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి మరి.

మెదక్, సిద్దిపేట దొరల జాగీరు కాదు

బీఆర్ఎస్ తీరుపై భగ్గుమన్న పీసీసీ నేతలు సుప్రభాతరావు, మ్యాదంబాలకృష్ణ

నవతెలంగాణ -మెదక్

మెదక్ అంటే సిద్దిపేట దొరల జాగీరు కాదని పీసీసీ నేతలు సుప్రభాత రావు, మ్యాడం బాలకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగం తీరుపై స్పందించిన పీసీసీ ప్రతినిధులు గురువారం మెదక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడుపాయల దుర్గామాత సాక్షిగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. ఏడుపాయల దుర్గామాతకు రూ.100 కోట్ల నిధులు విడుదల చేస్తామని పదేళ్ల క్రితం చెప్పి ఇప్పటివరకు అమలు చేయనందుకు సిగ్గుతో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నగారా మోగించేందుకు కొత్త కలెక్టరేట్లో పచ్చి అబద్ధాలతో మోసపూరితమైన హామీలు ప్రకటించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావుకు మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో రోడ్లు ఎక్కడ ఉన్నాయో తెలియదనే విషయం ఒప్పుకోవాలన్నారు. మెదక్ పట్టణానికి రింగ్ రోడ్డు మంజూరైనట్టుగా హరీష్ రావు సభాముఖంగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. రోడ్లు ఎక్కడున్నాయో కేసీఆర్ అల్లుడికే తెలియదనే విషయం ప్రతిపక్షాల పై సెటైర్లు వేయడం ముఖ్యమంత్రి దిగజారుడుతనానికి నిదర్శనమని అభివర్ణించారు. ముఖ్యమంత్రి హెూదాలో తన స్థాయిని మరిచి కేసీఆర్ ప్రసంగించారని మండిపడ్డారు. మెదక్ లో అభివృద్ధి కుంటుపడిందన్న విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి సభా వేదికగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఇది విన్న స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి చప్పట్లు కొడుతూ స్వాగతించడం బానిస మనస్తత్వానికి నిదర్శనమని తెలిపారు. మంత్రి హరీష్ రావు ప్రసంగం మోసగాడి నోట పశ్చాత్తాపంలా సాగిందని పేర్కొన్నారు. అబద్ధాలు ఎలా చెప్పాలో తెలియక హరీష్ రావు తికమక పడ్డారని విమర్శించారు. ప్రతిపక్షాలను విమర్శించే ముందు తమ బతుకు, జ్ఞానం ఏంటో కూడా హరీష్ రావు తెలుసుకొని ప్రవర్తించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో రామాయంపేట బ్లాక్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, రామాయంపేట పట్టణ మాజీ అధ్యక్షులు స్వామి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కాంగ్రెస్ యువ నాయకుల జాకీర్, మహేష్, నెహ్రూ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ ముదిరాజుల వ్యతిరేకి

నవతెలంగాణ-జగదేవపూర్: అభ్యర్థుల జాబితాలో ఒక్క ముదిరాజ్ అభ్యర్థి లేకపోవడం అన్యాయమని అందుకు బీఆర్ఎస్ పార్టీని ముదిరాజ్ సమాజం నుంచి బహిష్కరిస్తున్నామని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాగుల రాజు, యువజన అధ్యక్షులు సురేష్ ముదిరాజ్‌లు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ముదిరాజ్ సంఘం మండల నాయకుల ఆధ్వర్యంలో పండుగ సాయన్న విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న ముదిరాజు కులస్తులను సీఎం కేసీఆర్ ఎదగకుండా కుట్రలు చేస్తున్నాడని మండిపడ్డారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముదిరాజ్ సమాజం ఎంతో కృషి చేసిందన్నారు. పార్టీలో 10 నుంచి 15 మంది ముదిరాజ్ బిడ్డలకు ఎమ్మెల్యే సీటుకు అర్హత ఉన్నప్పటికీ ఒక్కరికి కూడా టికెట్ కేటాయించకపోవడం అన్యాయమన్నారు. కావున హుజూరాబాద్‌లో బుద్ధిచెప్పిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. ముదిరాజ్‌ల సత్తా ఏంటో చూపిస్తామని తెలిపారు. గజ్వేల్‌లో డిపాజిట్లు కూడా రాకుండా చేస్తామని మండిపడ్డారు. మండల ముదిరాజ్ సంఘం మహిళ అధ్యక్షురాలు జయమ్మ, మండల సర్పంచ్‌లు భిక్షపతి, మంజుల రమేష్, లక్ష్మీ చంద్రం, నర్సింలు, బాలకిషన్, పెద్దమల రాజు, గణేష్, ఎల్లేష్, బాలయ్య, రమేష్, శ్రీనివాస్, నర్సింలు. పుల్లయ్య, యువరాజు, కనకయ్య, నర్సింలు. జహంగీర్, బాలు, కొండయ్య పాల్గొన్నారు.



గొర్రెల కొనుగోలులో నిబంధనలు పాటించాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్



రెండవ విడత గొర్రెల పంపిణీలో అధికారులు నిబంధనలు పాటించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పశుసంవర్ధకశాఖ, 4వ స్పెషల్ కమిటీ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత గొర్రెల పంపిణీ కోసం గొర్రెలు తీసుకురావడానికి జిల్లా అధికారులతో కూడిన 4వ స్పెషల్ కమిటీ అనంతపురం, బళ్లారి వెళ్లనున్నారు. 4వ కమిటీ సుమారు వారం రోజుల పాటు ఈ ప్రక్రియలో భాగంగా కొనుగోలు కేంద్రాలలో ఉంటారు. సమకూర్చిన వాహనంలో జిల్లా స్పెషల్ అధికారి, అసిస్టెంట్, లబ్ధిదారుడు, స్టేట్ నుండి ఇద్దరు వెటర్నరీ డాక్టర్ అందరు కలిసి గొర్రెలను నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేసుకుని జాగ్రత్తగా తీసుకుని వచ్చి లబ్ధిదారునికి అందజేయాలి' అని తెలిపారు. గొర్రెలు తీసుకున్న కొంత కాలానికే అమ్మడం జరిగితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జెడి జగత్ కుమార్ రెడ్డి, డిఈఓ శ్రీనివాస్ రెడ్డి, సెరికల్చర్ ఏడి ఇంద్రసేనారెడ్డి, ఏడి మైనింగ్స్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీ

నవ తెలంగాణ - సిద్దిపేట

గత సంవత్సరం నవంబర్‌లో సమగ్రశిక్ష, ఆలింకో సారథ్యంలో నిర్వహించిన దివ్యాంగుల ఉచిత ఉపకరణాల కాంప్‌లో అర్హులైన వారికి ఈ నెల 26న ఉచిత ఉపకరణాల పంపిణీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వివిధ మండలాలకు చెందిన 233 మంది దివ్యాంగులకు అందించనున్నట్లు తెలిపారు. ఆయా మండలాలలో ఐఈఆర్‌సి, నాన్ ఐఈఆర్‌సిలలో పనిచేస్తున్న వారు అర్హులైన వారికి ఈ విషయాన్ని తెలిపి వారు కాంప్‌కు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు హాజరు కానున్నారని తెలిపారు.

మట్టి అక్రమ రవాణాపై ఆర్డీవోకు ఫిర్యాదు

నవతెలంగాణ జోగిపేట



అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో అక్రమార్కులు కొందరు మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఆర్డీఓ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ పరిధిలోని గుట్టలను రాత్రిపూట అక్రమంగా మట్టిని తీసి వెంచర్లకు, ప్లాట్లకు అమ్ముకుంటున్నారని వారు ఆరోపించారు. అధికారులు ఈ విషయంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దుర్గేష్, నాగరాజు, చందర్, బీఆర్ఎస్ నాయకులు సత్యం, నాగరత్నం గౌడ్, రవీంద్ర గౌడ్, వెంకటేశం, లక్ష్మణ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

మన ఆపద్బాంధవ ఫౌండేషన్ చేయూత

నవ తెలంగాణ -దౌల్తాబాద్



మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ గాంధీ ఆసుపత్రిలో మృతి చెందిన దొడ్డి యాదగిరి కుటుంబానికి యాభై కేజీల బియ్యంతో పాటు పదమూడు రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. మన ఆపద్బాంధవ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మన ఆపద్బాంధవుడు ఫౌండేషన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆపద్బాంధవ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ

నవ తెలంగాణ రాయపోల్



లయన్స్ క్లబ్ స్నేహ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడులు, పెన్సిల్, నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగిందని ఆరేపల్లి సర్పంచ్ కరుణాకర్, ప్రాథ మిక పాఠశాల ప్రధానోపాధ్యా యులు ముత్యం రెడ్డి అన్నారు. గురువారం రాయపోల్ మండలం ఆరేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ స్నేహ అధ్యక్షులు పరమేశ్వర చారి, సత్యనారాయణ, ఉపాధ్యాయులు కనకయ్య, ఎస్ఎంసి చైర్మన్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



నవతెలంగాణ-చేర్యాల

విద్యుత్ షాక్ తగిలి యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం హైదరాబాద్‌లోని సూరారంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... చేర్యాల మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన కడారి రామస్వామి (37) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని రసూల్‌పురాలో నివాసముంటూ సూరారంలోని ఓ వైన్స్ లో తినుబండారాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆ వైన్స్ ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పెన్సింగ్ కు ఉన్న ఫ్లెక్సీ ని తీస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లగా వెంటనే గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రామస్వామి మృతితో కుటుంబ సభ్యుల రోదనలను మిన్నంటాయి.


ఓటు వజ్రాయుధం



నవతెలంగాణ-మర్కుక్

ఓటు వజ్రాయుధం లాంటిదని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని శివారు వెంకటాపూర్ పుట్ట మంజుల నర్సింలు అన్నారు. ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని శివారు వెంకటాపూర్ పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రజలకు ఓటు దాని విలువపై, ప్రతి ఓటరు పాల్గొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై నమూనా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం పై ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, తదితరులున్నారు.

ప్లాసిక్ వాడితే చర్యలు



నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో డివిజనల్ పంచాయతీ అధికారి, మండల పంచాయతీ అధికారి అధ్వర్యంలో జగదేవపూర్ గ్రామంలో గురువారం ప్లాసిక్ వాడకం పరిశీలించారు. ప్లాస్టిక్ వాడినందుకు దుకాణ యజమానులు డబ్బా రాములు, రెడ్డమైన నవీన్, రాయల్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లకు ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధించారు. ప్లాస్టిక్ ఉపయోగించ కూడదన్నారు. పర్యావరణానికి ప్రతి ఒక్కరు కట్టు బడి ఉండాలన్నారు. కార్యక్రమములో పంచాయతీ కార్యదర్శి హరి ప్రసాద్, మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సర్కారు హ్యాట్రిక్ ఖాయం

నవతెలంగాణ-దుబ్బాక



ఇంటింటా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించడం ఖాయమని దుబ్బాక నియోజకవర్గం బిఆర్ఎస్ హార్డ్ వర్కర్ పండు అన్నారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో దుబ్బాక నియోజకవర్గం అన్నింటా అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఎంపీ ప్రభాకర్ రెడ్డికి దుబ్బాక అభ్యర్థిగా ప్రకటించడం హర్షనీయమన్నారు.సీఎం కేసీఆర్ మంత్రి హరీష్ రావు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక లో మెదక్ ఎంపీ, బిఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధిస్తాడన్నారు.

కాలనీలను అభివృద్ధి చేస్తాం



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్లోని అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. డివిజన్లోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో కమిటీ హాల్ వద్ద చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను అధికారులు, కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో కమిటీ హాల్ భవనం నుండి గణేష్ మండపం వరకు రూ: 30 లక్షలు తో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని అన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు మధ్యలోనే కరెంటు స్తంభాలు, రాంపులు తొలగించి విశాలంగా రోడ్డు వేసేలా అధికారులు పనిచేయాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో పనులు చేపట్టాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి జగన్నాథ్ రెడ్డి, కాలనీవాసులు మల్లారెడ్డి, వాసుదేవ్, రాజిరెడ్డి రమేష్, సహదేవ్ గౌడ్, చందు , ప్రతాప్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, జిహెచ్ఎంసి డిఈ నరేందర్, ఏఈ ప్రభు పాల్గొన్నారు.

గొల్ల కుర్మల ఆర్థిక స్వావలంబనకే గొర్రెల పంపిణీ

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్ చెరు: దేశంలోనే మొట్టమొదటిసారిగా గొల్ల కురుమల ఆర్థిక స్వావలంభన కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టారని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. రెండవ విడత గొర్రెల పంపిణీలో భాగంగా గురువారం పటాన్ చెరు మండలం పోచారం గ్రామంలో 12 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..20 మేకలు ఒక పోటేలుతో కూడిన యూనిట్ ధర ఒక లక్ష 75 వేల రూపాయలు కాగా సభ్యుడు 43,750 రూపాయలు చెల్లిస్తే, ప్రభుత్వం ఒక లక్ష 31 వేల 350 రూపాయలు సబ్సిడీ చెల్లిస్తోందని తెలిపారు. ప్రతి లబ్దిదారుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జగన్, నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బిక్షపతి, రాజు, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జులై నెల జీతం ఇప్పటి వరకూ ఇవ్వక పోవడం సరైంది కాదని, తక్షణమే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికుల సమావేశంలో మహిపాల్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ ప్రతినెలా జీతాలు ఇవ్వాల్సి ఉన్నా కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. కాంట్రాక్టర్ ఇవ్వకుంటే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనాలు, ఈ ఎస్ ఐ పి ఎఫ్ తదితర సమస్యలున్నాయని వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బండి సుధాకర్,ఏలీషా, తదితరులు ఉన్నారు.

ఓఆర్ఆర్‌పై వాహనాలు ఢీ



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ఓఆర్ఆర్ రోడ్డుపై రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన రెండు టిప్పర్లు ఓఆర్ఆర్ రోడ్డు మీద గచ్చిబౌలి వైపు వెళుతుండగా భాగమధ్యంలో కొల్లూరు వద్దకు రాగానే ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఆగి ఉన్న టిప్పర్ను మరో లారీ ఢీకొనడంతో అందులోని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో అతనిని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

ప్రణాళిక బద్ధంగా డివిజన్ల అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్ చెరు

బల్దియా పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మాణిక్య ప్రభు మందిరం సమీపంలో 26 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు

బొల్లారంలో చంద్రయాణం 3 విజయోత్సవ సంబరాలు

నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం



చంద్రయాణం 3 విజయోత్సవ సంబరాలు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బొల్లారంలో గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ టెంపుల్ నుండి గాంధీ బొమ్మ వరకు భారీగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందమామ పై భారత మువ్వన్నెల జెండా ఎగురవేసి భారత దేశం ఖ్యాతి ప్రపంచ వ్యాప్తంగా చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు, సిబ్బందికి బొల్లారం మున్సిపాలిటీ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాయి కిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, రవీందర్ రెడ్డి, పి శీను రెడ్డి శివ, విష్ణు చారి, అఖిల్ యోగి మనోజ్, తనీష్ పెద్ద ఎత్తున ప్రజలు , అభిమానులు, పాల్గొన్నారు..

ఓటర్ల జాబితా లోపాలను సరిదిద్దాలి

- నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి
- అవగాహన లోపంతో పనిచేస్తున్న బీఎల్ఓలపై కలెక్టర్ ఆగ్రహం
- బీఎల్ఓలు, సూపర్‌వైజర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ శరత్ కుమార్



నవతెలంగాణ-పటాన్‌చెరు: ఓటరు జాబితా లోపాలను సరిదిద్ది నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శరత్ కుమార్ బీఎల్ఓలు, సూపర్వైజర్లను ఆదేశించారు. పటాన్‌చెరు పట్టణంలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి బీఎల్వోలు, సూపర్వైజర్లతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన విద్యార్థిని, విద్యార్థులకు ఓటు హక్కు కలిపించేలా కళాశాలల ప్రాంగణంలోనే వారికి నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అవగాహన లోపంతో పని చేస్తున్న బీఎల్ఓలపై కలెక్టర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు బిఎల్వోలు సూపర్వైజర్లు పాల్గొన్నారు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సమ్మె
- అధికారుల హామీతో సమ్మె విరమణ
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి





నవతెలంగాణ-సంగారెడ్డి

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉదయం 5 గంటల నుంచి విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కారానికి అధికారులు హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ సంగారెడ్డి మున్సిపల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు ఎక్కడ ఏసినా గొంగడి అక్కడగానే ఉన్నాయన్నారు. మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, 11 వ పీఆర్సీ చైర్మెన్ సిఫారసు చేసిన వేతనాలు రూ. 19 వేలు, రూ.22900, రూ.31040లను కనీస వేతనాలుగా నిర్ణయించి ఇవ్వాలని తెలిపారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు 25 లక్షల ఇన్సురెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. కార్మికులందరికీ డబుల్ బెడురూం ఇండ్లు కేటాయించాలన్నారు. ఒకే రకమైన పనులు చేస్తున్న వారి మధ్య వేతన వ్యత్యాసాలు ఉండరాదని, కాంట్రాక్టు కార్మికునికి సైతం పర్మినెంట్ ఉద్యోగులతో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని అన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతులలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సువర్ణ, ఎల్లమ్మ, సంగీత, లక్ష్మి , మల్లేశం, లక్ష్మీ, వీరేశం, ముస్తఫా, శ్రీనివాస్, రాజు, వినోదు, మల్లేష్, మంజుల, రవి, తదితరులు పాల్గొన్నారు .

నవతెలంగాణ-జహీరాబాద్

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు వారాంతపు సెలవులు, ఈఎస్ఐ, పీఎఫ్, యూనిఫామ్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో 7వ రోజు మున్సిపల్ కార్యాలయం బయట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల అనంతరం మర్చిపోవడం సరైనది కాదన్నారు. తెలంగాణలో కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండదన్న కేసీఆర్ కాంట్రాక్టు వ్యవస్థలో ఉన్న మున్సిపల్ కార్మికులను ఎందుకు పర్మినెంట్ చేయడం లేదన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు రావాల్సిన రూ.21 వేల వేతనం అమలు చేయాలన్నారు. జహీరాబాద్ వారాంతపు సెలవులు అమలు కావడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలు ఉన్నాయన్నారు. సబ్బులు నూనెలు ఇవ్వటం లేదన్నారు. యూనిఫామ్ లేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పున్నెమ్మ, యశోదమ్మ చంటి శేఖర్ తుకారం, విట్టల్, సంజీవ్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బల్దియాలో శరవేగంగా అభివృద్ధి పనులు
- కోట్ల రూపాయలతో మౌలిక వసతులు
- జిహెచ్ఎంసి కార్పొరేటర్లు, అధికారులతో సమీక్ష సమావేశం



నవతెలంగాణ-పటాన్ చెరు

జిహెచ్ఎంసి పరిధిలోని వార్డులలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్ చెరు పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో జిహెచ్ఎంసి కార్పొరేటర్లు, బల్దియ అధికారులతో కలిసి అభివృద్ధి పనుల పురోగతిపై జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలోని భారతి నగర్, పటాన్ చెరు, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల 3 డివిజన్లో పరిధిలో సిసి రోడ్ల నిర్మాణానికి 22 కోట్ల రూపాయలు నిధులు కేటాయించామన్నారు.అభివృద్ధి పనుల అమల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని ఆదేశించారు.అదేవిధంగా పెండింగ్ నిధుల మంజూరు, నూతన అభివృద్ధి పనుల నిధుల కోసం త్వరలోనే మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ తో సమావేశం కానున్నట్లు తెలిపారు.జాతీయ రహదారిపై విద్యుత్ దీపాల నిర్వహణ సంతృప్తికరంగా లేదంటూ సంభందిత శాఖ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.నూతన కాలనీలలో పారిశుధ్య నిర్వహణ కోసం నూతన సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఇంజనీరింగ్ శాఖ ఈఈ శంకర్ నాయక్, డిప్యూటీ కమిషనర్ సురేష్, అధికారులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ జయప్రదం చేయండి



నవతెలంగాణ-జిన్నారం

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఉపాధ్యాయ బృందాలు పెద్ద ఎత్తున తరలిరావాలని రాష్ట్ర కమిటీ సభ్యులు అమరేశ్వర్, టి ఎస్ యు టి ఎఫ్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి సాయిలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిన్నారం మండలంలోని శివనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో పోస్టర్ను ఆవిష్కరించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, పర్యవేక్షక అధికారులైన డిఈఓ, డిప్యూటీఈవో, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే ఐ ఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయుల వివిధ రకాల పెండింగ్ బిల్స్ వెంటనే జమ చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు చేపట్టాలని, సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల సాధన కోసం టీఎస్ యుటిఎఫ్ గా నిరంతర పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఉద్యమాల ద్వారా సమస్యల సాధన కోసం పనిచేస్తున్న టీఎస్ యుటిఎఫ్ లో సభ్యులుగా చేరి, ఉపాధ్యాయ ఉద్యమాలు బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ క్రమంలోనే ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్ మహా ధర్నాకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి,జి.విశాలి,మండల నాయకులు ఉమాదేవి,కృష్ణమూర్తి, వినోద్ పాల్గొన్నారు

26, 27న హైదరాబాద్‌లో జాతీయ దళిత సదస్సు

- జాతీయ దళిత సదస్సుకు ప్రతినిధిగా అతిమేల మాణిక్



నవతెలంగాణ-సంగారెడ్డి

దేశానికి సమగ్ర దళిత అజెండా ఇవ్వడమే లక్ష్యంగా ఈ నెల 26, 27వ తేదీల్లో హైదరాబాద్ బేగంపేట్‌లోని హరిత ప్లాజాలో జాతీయ దళిత సదస్సు జరుగుతుందని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి అతిమేల మాణిక్ అన్నారు. ఈ జాతీయ దళిత సదస్సుకు ప్రతినిధిగా కెవిపిఎస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అతిమేల మాణిక్‌కు ఆహ్వానం అందింది. ఇందులో 26 రాష్ట్రాల నుండి 80 సంఘాల భాగస్వామ్యంతో 300 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని మాణిక్ తెలిపారు. ఈ జాతీయ సదస్సులో యూజీసీ మాజీ చైర్మన్ సుఖాదియో తోరాట్, హర్యానా కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాజశేఖర్ ఉండ్రు, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి వంటి ప్రముఖులు పాల్గొంటున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన పది ఏండ్లలో దళితుల పైన దాడులు హత్యలు అత్యాచారాలు వివక్ష పెరిగాయని అన్నారు. ఆ పార్టీ మేనిఫెస్టోలో కనీసం దళితుల సంబంధించిన అజెండా లేదని అన్నారు. దళిత విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఉద్దేశించినరాజీవ్ గాంధీ ఫెలోషిప్ వంటి పథకాల్లో పెద్ద ఎత్తున కోత విధించిందని అన్నారు. ఎస్సీ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిధులు స్కాలర్ షిప్ లోను కోతులు విధించిందని అన్నారు. దళితుల అజెండాను దేశం ముందు పెట్టేందుకే ఈ జాతీయ సదస్సు చర్చ జరుగుతుందని అన్నారు. ఈ అజెండా దేశ రాజకీయాలు, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే లా ఉంటాయని అన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తు న్న వారిలో 60 శాతం మంది దళితులే ఉన్నారని తెలిపారు. 75 ఏండ్ల స్వాతంత్ర భారతంలో ఇన్నాళ్లు దళితులను ఓటు బ్యాంకుగా చుసారే తప్ప స్వావలంబన, సాధికారతకు కృషి చేయాలేదన్నారు. భూమి ఉద్యోగాలు పరిశ్రమలు సహా అన్నింటా దళితుల వాటాను ఖచ్చితంగా కోరుతామని అన్నారు.

ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్‌లో చేరారు

- రాములు యాదవ్



నవతెలంగాణ-జహీరాబాద్

మంత్రి హరీశ్‌రావు కన్ను జహీరాబాద్ నియోజకవర్గంపై పడ్డదని, ఈ నియోజకవర్గాన్ని దోచుకునేందుకు అన్ని విధాలా ప్రయోగాలు చేస్తున్నారని రాములు యాదవ్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాములు యాదవ్ మాట్లాడుతూ నాడు సిద్దిపేటలో భూముల ధరలు ఎక్కువగా ఉండేవని, నేడు జహీరాబాద్ లో భూముల ధరలు ఎక్కువగా ఉన్నాయని, పారిశ్రామికంగా జహీరాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందుతున్నందున ఈ ప్రాంతాన్ని దోచుకోవాలన్న లక్ష్యంతోనే మంత్రి హరీశ్‌రావు తన అనుచరులతో దోపిడీకి పన్నాగం పన్నినాడని ఆరోపించారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని నీమ్జ్ చుట్టుపక్కలా కొన్ని వేల ఎకరాల భూమిని తన బినామీల పేర్లమీద మంత్రి హరీశ్‌రావు కొనుగోలు చేశాడని, త్వరలోనే ఆ చిట్టాలను విప్పుతామన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసమే తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. గతంలో ఎంఆర్ఎఫ్, మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలలో అధ్యక్షునిగా గెలుపొందిన అనంతరం కార్మికులకు ప్లాట్లు ఇస్తామని కొన్ని కోట్ల రూపాయలు దోపిడీకి పాల్పడినాడన్నారు. మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు వేసుకున్న వెంచర్కు కనీసం రోడ్డు సౌకర్యం కూడా కల్పించకపోతే అక్కడి రైతుల వద్దకు వెళ్లి మాట్లాడి రోడ్డు సమస్యలు పరిష్కరించానని తెలిపారు. తాను తెలుగుదేశం ప్రభుత్వంలో, టిఆర్ఎస్ ప్రభుత్వంలో నీతి నిజాయితీ గల కార్యకర్తగా పని చేశానని, తెలిపారు. ఇక్కడ కూడా నీతి నిజాయితీగా పనిచేసే కార్మికులకు ప్రజలకు సేవలు అందిస్తానన్నారు. మంత్రి హరీశ్‌రావు ఇంటికి వచ్చి స్వాగతం పలికినందువలనే పార్టీలో చేరడం జరిగిందన్నారు. పార్టీలో చేరే ముందు ఎన్నో రకాల హామీలు ఇచ్చారని అన్నారు. టిఆర్ఎస్ పార్టీలో చేరేముందు జాగ్రత్త సుమా అని ఢిల్లీ వసంత్, నరోత్తములకు హెచ్చరించానని తెలిపారు. తాను టిఆర్ఎస్‌లో చేరిన అనంతరం అనుభవిస్తున్న కష్టాలను కూడా వారికి వివరించానని తెలిపారు. నేడు ఆ ఇద్దరిని కూడా రోడ్డుపైకి తీసుకువచ్చి వదిలిపెట్టిన ఘనత మంత్రికే దక్కుతుందన్నారు. మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో ఆయన బినామీ మదన్మోహన్‌తో రూ.15 కోట్లు వసూలు చేయించి ఎన్ని తిన్నాడో కార్మికులే చెబుతున్నారని అన్నారు. ట్రైడెంట్ చక్కెర పరిశ్రమను దశలవారీగా విక్రయించేందుకు మంత్రి కుట్ర పన్నారని ఆరోపించారు. పరిశ్రమ చుట్టూ ఉన్న భూమిని ఆయన అనుచరులే కొనుగోలు చేశారన్నారు. పరిశ్రమకు మొత్తం 135 ఎకరాల భూమి ఉంటే నేడు కేవలం 45 ఎకరాలు మాత్రమే మిగిలిందన్నారు. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎవ్వరికీ టికెట్ ఇచ్చినా మంత్రి ఆగడాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లి కడప కడపకు తిరిగి బీఆర్ఎస్ అభ్యర్థిని ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు సాయి శక్తులా కృషి చేస్తానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్బర్ ,ముల్తానీ, నాగిశెట్టి ,విట్టల్ గౌడ్, కిషన్ ,జాకీర్ పటేల్, గుండారెడ్డి నాగేష్ ,వెంకట్ రెడ్డి ,తుకారాం, హనుమంత్ రెడ్డి, కృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- నోటిఫికేషన్ పత్రాలను దహనం చేసిన ఏఎన్ఎంలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సెకండ్ ఏఎన్ఎంలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోయిని ప్రసాద్ అన్నారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా ఏఎన్ఎంలు రోడ్డుపై మానవహారంగా ఏర్పడి ఏఎన్ఎం ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోయిని ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖలో పదహారేళ్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎం లను బేషరతుగా ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దురదృష్టవశాత్తు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్ఎంల పట్ల సీఎం కేసీఆర్ టిఆర్ఎస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఇది మంచి పద్ధతి కాదన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో గ్రామాల్లో సర్పంచులు ఎంపిటిసిలు నియోజకవర్గంలో ప్రభుత్వ పెద్దలకు కోవిడ్ టీకాలు సర్వీస్ చేసినా సెకండ్ ఏఎన్ఎం లను ప్రజాప్రతినిధులు మర్చిపోయారా అని ఆయన నిలదీశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని అసెంబ్లీలో బహిరంగ సభలో చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పటివరకు ఎందుకు కాంట్రాక్టు రెగ్యులర్ చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని సమస్యలు పరిష్కరించే ఉద్దేశం ప్రభుత్వానికి కనిపించడం లేదని ఆయన ఆరోపించారు.ప్రభుత్వం వెంటనే దిగివచ్చి రెండవ ఏఎన్ఎం లతో చర్చలు జరిపి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్యామల, కమల, గంగు బాయి, పద్మావతి, సురేఖ, నాగమణి, మంజుల, భారతి, కవిత, పోచమ్మ వినయ, అన్నపూర్ణ, సునీత, పుణ్యమ్మ పాల్గొన్నారు

గీతం స్మార్ట్ ఐడియాథాన్ ఘనంగా ప్రారంభం



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్మార్ట్ ఐడియా థాన్ ను (అత్యుత్తమ ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రాంగణంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. స్టార్టప్ ఇండియా, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్స్ (సీఈఎం), బోస్టన్లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎంటర్ ప్రేన్యూర్ ఎడ్యుకేషన్ (ఎన్ఎయూసీఈఈ)ల సహకారంతో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల కార్యక్రమ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా హై దరాబాద్ ఏంజెల్స్ చైర్మన్ రాజేష్ మంతెన, ఆత్మీయ అతిథిగా కంట్రోల్ ఎస్ క్వాలిటీ-ప్రొక్యూర్మెంట్ హెడ్ చంద్రశేఖర్ శర్మ గరిమెళ్ల పాల్గొన్నారు.యువత జీవితంలో రాణించడానికి ఉపకరించే ప్రాథమిక అంశాలైన ఉత్సుకత, ధైర్యం, శీలం, భావప్రకటన నైపుణ్యాల గురించి రాజేష్ మంతెన వివరించారు. ఎప్పటికప్పుడు మారుతున్న, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో నిరంతరం నేర్చుకునే ఉత్సుకత ఉండాలని, అప్పుడే వృద్ధితో పాటు అనుభవాన్ని కూడా గడిస్తామన్నారు. విద్యతో పాటు కళలు, సంగీతం, భౌతిక - జీవశాస్త్రం వంటి విభిన్న రంగాలలో కూడా నైపుణ్యం గడించడం ఉత్తమమని చెప్పారు. ధైర్యమంటే భయం లేకపోవడం కాదని, భయం కంటే ముఖ్యమైనది మరొకటి ఉందన్నారు. భయం ఉన్నప్పటికీ ధైర్యంగా ముందుకెళ్లడం, నిర్ణాయకశక్తిగా ఎదగడాన్ని సూపర్ పవర్ గా ఆయన అభివర్ణించారు. సంక్లిష్టమైన పరిస్థితులను విశ్లేషించడం ద్వారా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సహోద్యోగులను గౌరవించాలని, చక్కగా వినడం, దీర్ఘదృష్టితో యోచించాలని రాజేష్ ఔత్సాహిక వ్యవస్థాపకులకు సలహా ఇచ్చారు. దయగా, మర్యాదగా, ఉదారంగా, నైతికంగా ఉండడమే అభివృద్ధి చెందడానికి సులువైన మార్గమన్నారు. భావ ప్రకటనా నై పుణ్యం ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెబుతూ, దానిని నిరంతర సాధనతో అలవరచుకోవాలని చెప్పారు. తమదైన శైలితో ఎంపిక చేసుకున్న రంగాలలో రాణించాలని రాజేష్ మంతెన సూచించారు.ఆత్మీయ అతిథి చంద్రశేఖర్ శర్మ మాట్లాడుతు రాబడి అధికంగా ఉండే వాటిలో నూతన ఆవిష్కరణలు చేయాలని చెప్పడంతో పాటు కంట్రోల్ ఎస్ గురించి, దాని సేవలను వివరించారు. గీతం హై దరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు ప్రారంభోపన్యాసం చేయగా, వీడీసీ డిప్యూటీ డైరెక్టర్ ఫక్రుద్దీన్ షేక్ అతిథులను స్వాగతించారు. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ గ్రెగ్ కొల్లియర్, సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవి రామమూర్తి, గీతం చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ క్రిస్ నంగెగడ్డ, వీడీసీ డైరెక్టర్ డి. శ్రీదేవి తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.ప్రారంభోత్సవ వేడుకలు ముగిశాక, 'ఉన్నత విద్యా సంస్థలలోని విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదిగే వాతావరణాన్ని ఎలా సృష్టించాలి' అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సుస్మిత సుందర్, వీహబ్ డైరెక్టర్ (వ్యూహం-భాగస్వామ్యం) సృజన చదలవాడ, ఐఎస్‌బీలోని ఐ-వెంచర్ అసోసియేట్ వెస్ట్ ప్రెసిడెంట్ సురేష్ కృష్ణ, ఐటీఐసీ ధృవ్ గుప్తాలు పాల్గొన్నారు.ఆహారం-ఆరోగ్యం, స్టెమ్ కోసం బొమ్మలు, స్థిరమైన ఫ్యాషన్, పొదుపుగా ఉండే ఆవిష్కరణ అనే నాల ఇతివృత్తాలుగా నిర్వహిస్తున్న ఈ పోటీలలో దేశం నలుమూలల నుంచి 1,007 దరఖాస్తులు రాగా, వాటిలో 310 ఆహారం-ఆరోగ్యంపైబి 76 స్టెమ్ కోసం బొమ్మలు, 135 స్థిరమైన ఫ్యాషన్ కు చెందినవి కాగా, గరిష్ఠంగా 489 దరఖాస్తులు పొదుపుగా ఉండే ఆవిష్కరణకు సంబంధించినవి. అనేక వడపోతల తరువాత 32 జట్లను సెమీ-ఫైనల్ కు ఎంపిక చేయగా, గురువారం ప్రజెంటేషన్లు పూర్తయ్యాక ఎనిమిది జట్లను తుది పోరుకు ఎంపిక చేశారు. అందులో అత్యుత్తమంగా నిలిచిన జట్టుకు రెండు లక్షల రూపాయల నగదు పురస్కారం, ద్వితీయ స్థానం పొందినవారికి లక్ష రూపాయలు ఇచ్చి సత్కరించనున్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణానికి చెందిన సయ్యద్ జలీల్ కుమార్తె సుమయ్య ఫాతిమా జహీరాబాద్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పదో తరగతి, ఆర్ ఎల్ ఆర్ స్కూల్ లో ఇంటర్మీడియేట్, ప్రత్యేక నీట్ కోచింగ్ షాహీన్ కాలేజ్ బీదర్‌లో నీట్ కోచింగ్ తీసుకున్న తర్వాత ఉత్తమ మార్కులతో పాసయ్యారు. హైదరాబాదులోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్ సంపాదించారు. గురువారం సయ్యద్ జలీల్‌ను, కుమార్తెను జహీరాబాద్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు పి.రాములు నేత, మోతీరాం రాథోడ్, మహమ్మద్ అబ్దుల్లా, మొహమ్మద్ జాంగిర్ సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొని అభినందించారు సన్మానించారు అందుకు సుమయ్య ఫాతిమా సంతోషించి పెద్దలు చూపిన మార్గంలో నడుచుకుంటానని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రికి స్ట్రక్చర్, వీల్ చైర్ అందజేత

నవతెలంగాణ-జోగిపేట



అందోల్, జోగిపేట మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ కొరబోయిన నాగరాజ్ (నాని) జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సౌకర్యార్థం స్ట్రక్చర్, వీల్ చైర్ అందజేశారు. తన జన్మదినం సందర్భంగా ఆసుపత్రికి వీటిని ఇచ్చేందుకు డాక్టర్లతో మాట్లాడడంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. తాను చేసే సేవా కార్యక్రమాలలో భాగంగా వీటిని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ డాక్టర్లు ప్రజల ప్రాణాలు కాపాడే మహోన్నత వ్యక్తులు అన్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేశారు. అనంతరం ఆసుపత్రిలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, అందోల్ నియోజకవర్గం ఆత్మగౌరవ కమిటీ ఉపాధ్యక్షులు ప్రవీణ్, పట్టణ వాసవి క్లబ్ అధ్యక్షులు రంగ కిషన్, ఐసీటీసీ నరసింహ, యువ నాయకులు బాయికాడి రాజు, కృష్ణ, భీమ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర చైర్మన్ బిక్షపతి

12వ వార్డు కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు జన్మదినం సందర్భంగా గురువారం సాయంత్రం జోగిపేటలోని బృందావన్ కాలనీలోని ఆయన నివాసానికి వచ్చిన రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా డిసిసిబి మాజీ ఉపాధ్యక్షులు జయపాల్ రెడ్డి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

12 వార్డులో ఇంటింటికీ మొక్కలు పంపిణీ

నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం



బొల్లారం పురపాలక పరిధిలోని 12వ వార్డులో కౌన్సిలర్ ఆరూరు బాలమణి రత్నం ఆధ్వర్యంలో హరితహారం లో భాగంగా గురువారం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తద్వారా పర్యావరణ పరిరక్షణ కు పాటుపడాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ములుగు మండల నూతన కమిటీ



నవతెలంగాణ-ములుగు

గజ్వేల్ డివిజన్ ములుగు మండల కేంద్రంలో గురువారం ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ 14 మందితో వేశారు. అనంతరం గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు నాచారం శేఖర్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల కోసం నిరంతరం కృషి చేస్తూ వుంటుందన్నారు. ఈ క్రమంలో ములుగు మండల ఎస్ఎఫ్ఐ కమిటీ ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులుగా బ్యాగరి సాయి, కార్యదర్శిగా బుడిగే చింటు, ఉపాధ్యక్షులుగా అరవింద్, కార్తిక్, అభినయ సహాయ కార్యదర్శిలు బాబు, అభిషేక్, కళ్యాణి కమిటీ సభ్యులు రాజు, హరిబాబు, సన్నీ, మని, సాయి కుమార్, ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ నూతన కమిటికి డివిజన్ కమిటీ అభినందనలు తెలిపి, ఉతేజంతో ములుగు కేంద్రంలో వున్న సమస్యలు వెలికితీసి పరిష్కరించే దిశగా వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు తెడెం నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు

మైనంపల్లి నీ బతుకేమిటో ప్రజలకు తెలుసు: ఎమ్మెల్సీ



నవతెలంగాణ- గజ్వేల్

మల్కాజ్గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తీరు బాగాలేదని, ఆయన తనగతం తెలుసుకోవాలని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించిన బాటలో నడుస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావుపై చేసిన వ్యాఖ్యలను మైనంపల్లి హనుమంతరావు వెనుకకు తీసుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన హరీశ్‌రావును విమర్శిస్తే యావత్ తెలంగాణ ప్రజలు తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు. వెంటనే మైనంపల్లి హనుమంతరావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీకి కష్టపడే వారికి ముఖ్యమంత్రి గుర్తించి టికెట్లు టికెట్ కేటాయించినట్లు తెలిపారు. మైనంపల్లి హనుమంతరావు నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

- రూ. 18 వేలకు పారితోషకం పెంచాలి
- కలెక్టర్ కార్యాలయం ముందు ఆశాల ధర్నా
- అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత





నవతెలంగాణ-మెదక్

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె. నర్సమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏ. మల్లేశంలు డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మెదక్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మెదక్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గత 18 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగులు పొందినట్లు తెలిపారు. రిజిస్టర్స్ రాయడం, సర్వేలు చేయడం. ఆన్లైన్ పనిచేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు గర్భిణీ, బాలింతలు, చిన్న పిల్లలకు, ఇతర ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. డబ్ల్యూహెచ్ఓ ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశ వర్కర్లకు అవార్డును ప్రకటించింది, ఇన్ని పనులు నిర్వహిస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశలకు నేటికీ నిర్ణయం చేయకపోవడం వలన ఆశా వర్కర్లు అన్యానికి గురవుతున్నారని తెలిపారు. గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశా వర్కర్లకు పనిభారం విపరీతంగా పెరిగిందని, పారి తోషికంతో పాటు పారితోషికాలు లేని అనేక పనులను ప్రభుత్వం ఆశలతో చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సబ్ సెంటర్స్. బస్తి దావఖానాలో పని చేయాలని ఆశాలకు ప్రభుత్వం చెబుతున్నదన్నారు. ఇంత పనిచేస్తున్న ఆశలకు కేవలం రూ. 9,750 పారితోషకాలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తున్నదన్నారు. ఒకవైపు పని భారం పెరిగిందని, మరో వైపు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో వచ్చే పారితోషికాలు సరిపోక ఆశా వర్కర్లు మేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఆశాల పారితోషకాలను రూ.18,000కు పెంచి ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పారితోషికం లేని అదనపు పనులు ఆశలతో చేయించకూడదు, టీబి స్పుటం డబ్బాలను ఆశలతో మోపించి పనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీబి, లెప్రసీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. లెప్రసి సర్వేలో వస్తున్న ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. వాలంటరీలను ఏర్పాటు చేయాలి, ఆశలకు పని భారం తగ్గించాలి జాబ్ చార్టును విడుదల చేయాలని, 2021 జులై నుండి డిసెంబర్ వరకు ఆరు నెలల పిఆర్సి ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలోవెన్స్ నెలకు రూ. 1000 చొప్పున 16 నెలల బకాయిలు డబ్బులు వెంటనే చెల్లించాలని, 32 రకాల రిజిస్టర్స్ ను వెంటనే ప్రింట్ చేసి ప్రభుత్వం సప్లై చేయాలని కోరారు. క్వాలిటీతో కూడిన ఐదు సంవత్సరాల పెండింగ్ యూనిఫాం వెంటనే ఇవ్వాలని, ఆశలకు ప్రసూతి సెలవుల పైన సర్క్యులర్ వెంటనే జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వం, ఆశాల ఆవేశానికి గురికాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పెంటమ్మ రేణుక, సభిత, రమ్య, అనసూయ, ఉమాదేవి, రాములమ్మ, నర్సమ్మ, చంద్రకళ, రాణి, యశోద, బాలమణి, సుజాత, భాగ్య, మంజుల, అనసూయ, మాధవి, నాగమణి, దుర్గ, మంజుల, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ సాగర్‌ను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో గల కొండపోచమ్మ సాగర్‌ను జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ గురువారం సందర్శించారు. అనంతరం కర్కపట్ల, దామరకుంట గ్రామాలలోని నర్సరీలను, పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు. దామరకుంట పాఠశాలను, జెపిఎస్‌ల రికార్డులను డీఏల్పివో వేదావతి, మర్కుక్ ఎంపివో రాజాలింగంతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి బాస్కర్, కర్కపట్ల, దామరకుంట సర్పంచులు గాజే నర్సింలు, గాయత్రి బాలనర్సయ్య కొండపోచమ్మ సాగర్ ఇంజనీర్ శ్రావణ్ డా.శ్రీనివాస్, వివిధ గ్రామ పంచాయితీ కార్యదర్శులు మౌన, రేఖా, రోజా, తదితరులున్నారు

పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి ఉద్యోగస్తులందరి కృషి



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి ఉద్యోగస్తులందరూ కృషి చేస్తున్నారని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రంరెడ్డిలు అన్నారు. టీఎన్జీవో సిద్దిపేట జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్ అధ్యక్షతన బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కార్యవర్గం ఎన్నికైన తర్వాత మొదటి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని, ఎన్నుకున్న యూనిట్ అధ్యక్ష కార్యదర్శులకు, ఫోరం అధ్యక్ష కార్యదర్శులకు, ఉద్యోగులందరికి పేరుపేరునా జిల్లా కార్యవర్గం తరపున ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఏ ఉద్యోగులకు సమస్య వచ్చినా మీ తాలూకా అధ్యక్ష కార్యదర్శులతో తమ వద్దకు వస్తే ఆ సమస్యలను పరిష్కరించే విధంగా సహాయ సహకారాలు అందిస్తామని, జిల్లా సమస్యలను మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా, హెడ్ ఆఫీస్ లో ఉన్న సమస్యలను రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. నూతనంగా సిద్దిపేట జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నందుకు టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మామిళ్ళ రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌కు సిద్దిపేట జిల్లా తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో టీఎన్జీవో సహాధ్యక్షులు నిమ్మ సురేందర్ రెడ్డి , కోశాధికారి అశ్వక్ అహ్మద్, సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు, ఫోరం అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆగిన మల్లన్న సాగర్ కాల్వపనులు

- కాలువలలో నిలిచిన నీరు ప్రమాదం అంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు పాలకులు
- పట్టించుకోవాలని గ్రామస్తుల వేడుకోలు



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలతో మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌లను, నిర్మించి కాలువల ద్వారా చెరువులను నింపి గ్రామాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కృషి చేస్తుంటే కాంట్రాక్టర్లు, అధికారులు పాలకులు పట్టించుకోవడంలేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో మల్లన్నసాగర్ కాల్వ పనులు ఆగిపోయి దాదాపు 6 నెలలు అవుతుందని కాంట్రాక్టర్ పనులు చేయించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నార్లాపూర్ గ్రామానికి ఆనుకొని పక్క నుంచి కాలువ తీయడం జరిగింది. ఆ కాలువలు నీటితో నిండి పెద్ద కుంటలాగా మారాయి. కాల్వ పక్కనుంచే రోడ్లు అక్కడ నుంచి రాత్రిపూట గాని ప్రయాణం చేయాలంటే బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జిలు కల్వర్టులు సగం సగం కట్టి విడిచిపెట్టడం జరిగిందని రోడ్లను తవ్వి మధ్యలోనే విడిచిపెట్టడం జరిగిందని ప్రయాణం చేయాలంటే నరకాయాతన అనుభవించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికీ దాదాపు పదుల సంఖ్యలోనే మోటర్ సైకిళ్ల ఢీకొనడంతో ప్రమాదాలు జరిగిన బాధితులు ఎందరో ఉన్నారు. ఎన్నిసార్లు అధికారులకు పాలకులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మెదక్‌లో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభలో మంత్రి హరీష్ రావు నిజాంపేట మండలానికి మల్లన్న సాగర్ కాల్వ ద్వారా నీళ్ల వచ్చాయనడం హస్యాస్పదమన్నారు. కాల్వా పనులే పూర్తికాలేదు, నీళ్ల ఎక్కడ నుంచి వచ్చాయని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి మల్లన్న సాగర్ కాల్వ పనులు పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

వెంటనే మల్లన్న సాగర్ కాల్వ పనులు పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం మల్లన్న సాగర్ కాల్వ పనులను మొదలుపెట్టి దాదాపు నాలుగు సంవత్సరాలు అవుతున్నదని నేటికీ పూర్తి కాకపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. గ్రామంలోని రైతులు తమ పొలాలను ప్రభుత్వం తక్కువ ధరలకు కొని, రైతులను తీవ్రంగా నష్టం చేసిందని నాలుగు సంవత్సరాల లో పంటలు పండించుకునే వారమని నేటికీ కాల్వపనులు పూర్తి కాకపోవడంతో మేము పంటలు ఎలా పండించుకోవాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి కాల్వ పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.





కృష్ణారెడ్డి, వార్డ్ మెంబర్, నార్లాపూర్

కాంటాక్ట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఆలస్యమవుతున్న పనులు



కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. చేసే పనులలో కూడా నాణ్యత లోపించిందని నాసిరకంగా పనులు జరుగుతున్నాయని మల్లన్నసాగర్ కాలువ పనులు ఆగిపోయి దాదాపు ఆరు నెలలు అవుతున్న ఎవరు స్పందించడం లేదని అధికారులు కాంట్రాక్టర్లు పట్టించుకోవడంలేదని కాల్వలలో వర్షం నీరు నిండి చెరువుల బావుల వలే కనిపిస్తున్నాయి. ఏదైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఇప్పటికైనా అధికారులు కాంట్రాక్టర్లు స్పందించి వెంటనే కాల్వపానులు పూర్తిచేయాలని కోరుతున్నాను

సంజీవ్, ఉప సర్పంచ్ నార్లాపూర్,

నిరుపేదకు పుస్తెమట్టెలు అందజేత



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ ఆధ్వ ర్యంలో కొర్తివాడ స్రవం తి పుట్టినరోజు సందర్భంగా కొర్తివాడ ఉమారాణి-లక్ష్మణ్, మౌనిక్‌ల సహకా రంతో నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మీ వివాహానికి పుస్తె, మట్టెలు, చీర అందించినట్లు వాసవి క్లబ్ అధ్యక్షుడు చింత రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తొడుపునూరి కృష్ణవేణి, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అర్వపల్లి హరికిరణ్, కార్యదర్శి చకిలం రవి, కోశాధికారి తిమ్మిశెట్టి లక్ష్మీ, పీఆర్వో అయిత శంకర్, బుక్క శివ పాల్గొన్నారు.

మెదక్ ప్రగతి నివేదిక సభకు హాజరైన వారికి ధన్యవాదాలు

- ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి



నవతెలంగాణ- నిజాంపేట: మెదక్ లో జరిగిన ప్రగతి నివేదిక సభకు హాజరైన ప్రతి ఒక్కరికి మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మెదక్ జిల్లాలోని గ్రామపంచా యతీలకు 15 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినం దుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. ప్రత్యేకంగా మెదక్ నియోజకవర్గంలోని జెడ్పీటీసీలకు, ఎంపీపీలకు ఎంపీటీసీలకు సర్పంచులకు గ్రామాల ప్రజలందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ప్రజలను నివేదిక సభకు తరలించడంలో సర్పంచులు ఎంపీపీలు, ఎంపీటీసీలు జెడ్పీటీసీలు చాలా కష్టపడ్డారని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదేవిధంగా మీ ప్రేమ అభిమానాలు తనపై ఎల్లవేళలచూపాలని మనసారా కోరుకుంటున్నానన్నారు.

రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన స్పెషల్ విజిలెన్స్ టీం

- పిల్లుట్లలో డీలర్‌పై కేసు నమోదు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండలంలోని పలు రేషన్ దుకాణాలను గురువారం స్పెషల్ విజిలెన్స్ టీం అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. నర్సాపూర్ పట్టణంలో మూడు రేషన్ దుకాణాలతో పాటు మండల పరిధిలోని, రెడ్డిపల్లి, మంతుర్ గ్రామాలలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను , స్టాక్ బ్యాలెన్స్‌ను పరిశీలించారు. అదేవిధంగా శివంపేట మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో ఉన్న రేషన్ దుకాణాన్ని తనిఖీ చేయగా, స్టాక్ బ్యాలెన్స్‌లో వ్యత్యాసం ఉండడంతో డీలర్‌పై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ విజిలెన్స్ కమిటీ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు మాట్లాడుతూ రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రేషన్ దుకాణంలో సమయపాలన పాటించాలని సూచించారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ ప్రణీత రెడ్డి, తహసీల్దార్ ప్రభాకర్, ఎన్ఫైలు వెంకటేశం సుబ్రహ్మణ్యంలు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఉత్తర ప్రదేశ్ ఎమ్మెల్సీ అవినీష్ కుమార్ సింగ్ పటేల్



నవతెలంగాణ-సంగారెడ్డి: కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉత్తర ప్రదేశ్ ఎమ్మెల్సీ అవినీష్ కుమార్ సింగ్ పటేల్ అన్నారు. గురువారం సంగారెడ్డి బిజెపి కేంద్ర పార్టీ చేపట్టినటువంటి అసెంబ్లీ ప్రవాస్ భారత్ యోజన కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు రవి శంకర్ అధ్వర్యంలో జరిగిన పట్టణ శాఖ సమావేశంలో సంగారెడ్డి అసెంబ్లీకి విచ్చేసిన ఉత్తర ప్రదేశ్(లక్నో)ఎమ్మెల్సీ అవినీష్ కుమార్ సింగ్ పటేల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. సంగారెడ్డి పట్టణంలో, బూత్ స్థాయిలో బిజెపి పార్టీనీ ఎలా బల పర్చాలో కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేవా అని తెలుసుకొని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర నాయకులు కొండపురం జగన్,హనుమత్ రెడ్డి, రాములు,నాయకోటి రమేష్, కసిని వాసు, మందుల నాగరాజు, అశ్వంత్, మురళీధర్ రెడ్డి,పట్టణ కార్యవర్గం, పట్టణ నాయకులు,కార్యకర్తలు, శక్తి కేంద్ర ఇంచర్జులు, బూత్ అధ్యక్షులు సమావేశం పాల్గొన్నారు.

దళిత బంధువు దళితులందరికీ ఇవ్వాలి



నవతెలంగాణ-టేక్మాల్

దళిత బంధు దళితులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎల్లకుర్తి శరీపల్లి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన 10 కుటుంబాలకు మాత్రమే దళిత బంధు పథకం వర్తింప చేస్తున్నారని గ్రామంలో ఉన్న 200 దళిత కుటుంబాలందరికీ దళిత బంధు పథకం అమలు చేయాలని ఎంపీడీఓ భారతికి ఉపసర్పంచ్ యాదయ్య గ్రామ దళితులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, మాణయ్య, శ్రీనివాస్, అశోక్, సామెల్, శ్యామయ్య, శంకర్, మొగులయ్య, నర్సింలు, అనిల్ ప్రసాద్, నాగయ్య, సుకుమార్, కిష్టయ్య, రమేష్‌లు ఉన్నారు.

మండల కేంద్రంలో ఇంటింటి సర్వే



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామానికి చెందిన బండారి పెద్ద దుబ్బ రాజయ్యకు పక్షవాతం రావడంతో అతని ఇంటికి వెళ్లి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం అనురాధ మాట్లాడుతూ నిజాంపేట గ్రామంలో బుధవారం ఇంటింటి సర్వే చేయడం జరుగుతుందన్నారు. .లెప్రసీ, టీబి, మొదలగు వ్యాధులను గుర్తించడానికి గుర్తించిన వారికి మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ శ్రావణమాసం నెలలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని జాగ్రత్త వహించాలన్నారు. గ్రామంలో ఎంతమంది వ్యాధిగ్రస్తులు ఉన్నా సమాచారంపై అధికారులకు విన్నవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి సంధ్య, ఆశా వర్కర్ బండారి లక్ష్మి కొమ్మూట బాలమణి, బండారి అనిత పాల్గొన్నారు

సీసీ రోడ్డు వేసిండ్రు మొరం మరిచిన్రు



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్ల రూపాయలతో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేయాలని నిధులను కేటాయించడం జరిగింది. మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో సీసీ రోడ్లు వేసిండ్రు రోడ్డుకు ఇరువైపులా మొరం పోయడం మరిచిన్రు. రోడ్డు కిరువైపులా మోరం పోయనట్లయితే ట్రాక్టర్లు ఆటోలు తిరగడంతో యాక్సిడెంట్లు అయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు కాంట్రాక్టర్ వెంటనే స్పందించి సిసి రోడ్లకు ఇరువైపులా మోరం పోసేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మొరం పోయనియెడల యాక్సిడెంట్లు అయితే అధికారులు, కాంట్రాక్టర్‌లే బాధ్యత వహించాలని గ్రామస్తులు స్పష్టం చేశారు.

డిగ్రీ కళాశాల విద్యార్థికి సన్మానం



నవతెలంగాణ-మెదక్ టౌన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో బిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి భానోత్ ముఖేష్ రాష్ట్రస్థాయి ఎనిమిది వందల మీటర్ల రన్నింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినందుకు ప్రిన్సిపల్ గణపతి, ఇన్చార్జి ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టిలరీ సెంటర్ మైదానం గోల్కొండలో సోమవారం జరిగిన పోటీలలో విజేతగా నిలిచినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి సి అధికారి డాక్టర్ సుధాకర్ లక్ష్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్‌ను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



నవతెలంగాణ-మెదక్ టౌన్

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ మెదక్ సూచనల మేరకు సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ మెదక్ సబ్ జైలును తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదిల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వంటశాలను తనిఖీ చేసి ఆహారం గురించి జైలు పర్యవేక్షణ అధికారితో చర్చించారు. న్యాయ విజ్ఞాన సదస్సులో ముద్దాయిలకు వివిధ అంశాలపైన అనగా లీగల్ ఎడ్ అపాయింట్మెంట్, జైల్ అదాలత్, ప్లీ భార్గెనింగ్ చట్టాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్ లాయర్ శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ లక్ష్మీ శారద



నవతెలంగాణ-మెదక్ టౌన్

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ లక్ష్మీ శారద మెదక్ కోర్టు ప్రాంగణంలో బ్యాంకు ఇన్సూరెన్సు స్టాండింగ్ కౌన్సిల్స్, చిట్‌ఫండ్ కౌన్సిల్స్‌తో మీటింగ్ నిర్వహించారు. నేషనల్ లోక్ అదాలత్ సెప్టెంబర్ 9వ తేదీన జిల్లా కోర్ట్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించుకునే విధంగా న్యాయవాదులు సహకరించాలని కోరారు. ఈ సదావకాశాన్ని ప్రజలు, కక్షిదారులు వినియోగించుకుని ఎక్కువ మొత్తంలో కేసులను రాజీ కుదుర్చుకొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జితేందర్, సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి రీటా లాల్ చంద్, స్టాండింగ్ కౌన్సిల్స్, చిట్ఫండ్స్ కౌన్సిల్స్, ప్యానల్ లాయర్స్, రిటైనర్ లాయర్స్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మందుల వినియోగంపై శిక్షణ



నవ తెలంగాణ ములుగు: నర్సాపూర్‌లో ఇంటర్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, సరిస్కా సేవా సంస్థ అగ్రికల్చర్ సస్టైన బిలిటీ ప్రోగ్రాం ద్వారా రైతులకు శిక్షణ ఇచ్చారు. కిసాన్ సేవా కేంద్ర అధికారులు, మేనేజర్ గగన్ శర్మ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-జగదేవపూర్

జిల్లా అదనపు కలెక్టర్ అగర్వాల్ గురువారం మండలంలో ఇటిక్యాల, తిమ్మాపూర్ గ్రామాల్లో పర్యటించారు. అందులో భాగంగా శానిటేషన్, డంపింగ్ షెడ్‌లో వర్మీ కంపోస్టు తయారు విధానం బాగున్నదన్నారు. గ్రామ పంచాయతీలో గల రికార్డులను పరిశీలన చేశారు. పాఠశాలలో గల విద్యార్థినులతో మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇస్రో సాధించిన చంద్రయాన్ -3 విజయం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠాలు సరిగ్గా బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమములో మండల ఎంపిపి బాలేశం గౌడ్, స్థానిక సర్పంచులు చంద్రశేఖర్, లక్ష్మీ, డిఎల్పీఓ వేదవతి, ఎంపిడిఓ శ్రీనివాస్ వర్మ, గ్రామ కార్యదర్శుల సత్యం, వేణు అయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశంల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపికి చెందిన నంగి పరమేష్, సకినాల శివతోపాటు పలువురికి బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు వారు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మంద సుమన్,కో ఆప్షన్ మెంబర్ ఎండి జిలాని, సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, గ్రామ శాఖ అధ్యక్షుడు చెవిటి మహేష్, దామెర మల్లేశం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మేక మహేష్, నాయకులు పుప్పాల బాలస్వామి, పుప్పాల కనకయ్య, నారదాసు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

9వ వార్డులో పారిశుద్ధ్య పనులు



నవ తెలంగాణ -దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డులో పిచ్చి మొక్కలు, గడ్డి పెరగకుండా గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించడం జరిగిందని కౌన్సిలర్ బత్తుల స్వామి తెలిపారు. వార్డులో దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా ఆయిల్ స్ప్రే, పిచ్చి మొక్కలు ,గడ్డి పెరగకుండా ఉండేందుకు గడ్డి మందును పిచికారి చేయించడం జరిగిందన్నారు.ప్రజలు తమ నివాస గృహాలతో పాటు చుట్టుపక్కల స్థలాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

క్రీడా ప్రాంగణాలను పరిశీలించిన జడ్పీ సీఈవో



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బెక్కల్, తోర్నాల, బైరాన్ పల్లి, గ్రామాలతో పాటు మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామాలలో నర్సరీ.క్రీడా ప్రాంగణాలను జడ్పీ సీఈవో రమేష్ గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్, ఎంపీఓ కాజా మొయినుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు సిద్దేశ్వర్, శ్రీకాంత్, భాస్కర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం వెళ్లిన మహిళ బావిలో పడి మృతి



నవతెలంగాణ-తొగుట

తాగునీటి కోసం వెళ్లిన మహిళ ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని కాన్గల్ గ్రామంలో చోటు చేసుకుంది. గురువారం పోలీసులు తెలిపిన కథనం ప్రకారం గ్రామానికి చెందిన కర్రోళ్ల ఎల్లవ్వ (52) ఉదయం తన వ్యవసాయం పనులలో భాగంగా పత్తి చెనులో కలుపు తీసేందుకు వెళ్ళింది. తాగునీటి కోసం పక్కన పొలం వరద మల్లేశం బోరుబావి వద్దకు వెళ్లి ప్రమాదవశత్తు కాలు జారి (స్టోరేజి గుంత) బావిలో పడి మృతి చెందింది. మృతురాలి కొడుకు కర్రోళ్ల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

27న కోమటి చెరువుపై 450 డ్రోన్ కెమెరాలతో ప్రదర్శన

నవతెలంగాణ-సిద్దిపేట

మరో అద్భుతమైన వేదిక నెలవు కానున్నది మన సిద్దిపేట కోమటి చెరువు. ప్రగతి విహంగం.. ఆకాశంలో అభివృద్ధి ప్రతిభింబంగా కనబడనుంది. మంత్రి హరీశ్ రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేటలోని కోమటి చెరువుపై ఈ నెల 27 న సాయంత్రం 6:30 కి 450 డ్రోన్ కెమెరాలతో ప్రదర్శన జరుపనున్నారు. సిద్దిపేట అభివృద్ధి కార్యక్రమాలు ఆకాశంలో కాంతి వెలుగులతో డ్రోన్ ద్వారా ప్రదర్శించే గొప్ప కార్యక్రమం కోమటి చెరువుపై చూపెట్టబోతున్నారు. అభివృద్ధి జరిగిన అంశాలను డ్రోన్ ల ద్వారా ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శనను తిలకించడానికి సిద్దిపేట పట్టణంతో పాటు, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు రానున్నారని, తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఆడపిల్ల బరువు కాదు బహుమానం



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో మంతూరి రేఖ యాదగిరి, ముబారస్‌పూర్ మన్నే శ్యామల కుమార్ దంపతులకు ఆడబిడ్డ జన్మించిన విషయం తెలుసుకొని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ ఆదేశాల మేరకు గురువారం వారిని కలిసి ఇంద్రమ్మ తోబుట్టు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీం కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆడబిడ్డకు బేబీ కిట్, బేబీ డ్రెస్, రూ.5000ల పోస్టల్ ఫిక్స్ డిపాజిట్ బాండ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్నల్ శ్రీనివాసరావు, మిద్దె భూపాల్ గౌడ్ (సిద్దిపేట జిల్లా సేవాదళ్ కార్యదర్శి), అశోక్ గౌడ్, ఐరేని సాయితేజ గౌడ్, పెంటం దేవరాజు, యాదగిరి, మల్లేశం, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

లచ్చపేటలో చంద్రయాన్-3 సక్సెస్ సంబరాలు



నవతెలంగాణ- దుబ్బాక

ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ -3 ప్రయోగం విజయవంతమవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో 10, 11, 12 వార్డుల ప్రజలు, యువకులు సక్సెస్ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.బాణాసంచ కాల్చి ఒకరికొకరు మిఠాయిలు పంచి పెట్టుకున్నారు.బిఆర్ఎస్ మున్సిపల్ నాయకులు నందాల శ్రీకాంత్ మాట్లాడుతూ, భారత ఖ్యాతిని పెంచేలా చంద్రయాన్ -3 విజయవంతమవడం దేశానికి గర్వకారణమన్నారు.అగ్రదేశాలకు సాధ్యపడని చంద్రుడి రహస్యాల్ని చంద్రయాన్ -3 చేధిస్తుందన్నారు.ఇస్రో ముస్ముందు మరిన్ని అద్భుతాలు సాధించాలని ఆకాంక్షించారు.ఎర్రగుంట శ్రీనివాస్, చొల్లేటి మల్లేశం, అవధూత రాములు, కూరపాటి సంతోష్ కుమార్, బోడ అరుణ్ కుమార్, మిరుదొడ్డి శ్రీనివాస్, మిరుదొడ్డి స్వామి, పలువురున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-నంగునూరు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో మంత్రి హరీష్ రావు సహకారంతో మూడో విడుతలో భాగంగా గ్రామ రైతులకి స్పింక్లర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక దిగుబడి వచ్చే ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి,రాష్ట్ర ఆయిల్ ఫామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాగుల సారయ్య ,నంగునూరు సోసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ పంగ కుమార్, ఎంపీటీసీ ఏటి తులసి పరమేశ్వర్ హార్టికల్చర్ అధికారులు ,బీఆర్ఎస్ గ్రామ శాఖ దదదదదదదదదదదఅధ్యక్షుడు వర్దోలు వెంకటేష్ యాదవ్, రైతుబంధు సమితి గ్రామ శాఖ అధ్యక్షుడు ఏల్చుల ఐలయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వర్దోలు వేణు చక్రవర్తి, శిలే ప్రశాంత్ గౌడ్, వార్డ్ మెంబర్లు సీనియర్ నాయకులు, బీఆర్ఎస్వై యువజన నాయకులు ఇమ్రాన్, సాగర్, సంపత్, అమర్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన రేషన్ డీలర్లు



నవతెలంగాణ-తొగుట: రేషన్ సంఘం అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను సన్మానించారు. నూతన తహసీల్దార్‌గా బదిలీపై విచ్చేసిన శ్రీకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ జహీర్, రేషన్ డీలర్లు హమ్మద్, నారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్ ఎంఈఓ ఎక్కడ ?

- పాఠశాలల్లో కరువైన ఎంఈఓ అజమాయిషి
- ఇన్చార్జి పేరిట విధులకు డుమ్మా



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రభుత్వ పాఠశాలలను క్రమశిక్షణతో నడిపించాల్సిన మండల విద్యాధికారి క్రమశిక్షణ తప్పుతుండడంతో పాఠశాలలో క్రమశిక్షణ లేకుండా పోయింది. మూడు మండలాలకు ఇన్చార్జి కావడంతో ఏ మండలంలో పని చేసిన పరిస్థితి కనిపించడంలేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. నంగునూరు మండల కేంద్రంగా పనిచేసే ఎంఈఓ దేశి రెడ్డికి చిన్నకోడూర్, హుస్నాబాద్ మండలం ఎంఈఓగా ఇన్చార్జి ఇవ్వడం వల్ల అక్కడ... ఇక్కడ... ఎక్కడ పని చేయడం లేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఎంఈఓల కొరత ఉన్నదని ప్రభుత్వం ఉన్న ఎంఈఓలకు అదనపు చార్జీలు ఇవ్వడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు గతి తప్పుతున్నాయి. పాఠశాలల నిర్వహణ అధ్వానంగా తయారు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేందుకు జంకుతున్నారు. ఉపాధ్యాయులు సరైన సమయంలో పాఠశాలలకు రాకపోవడం పాఠశాలల తరగతి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి పాఠశాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన





ఎంఈఓ పాఠశాలల వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతినెల పాఠశాలల పనితీరుపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించి, సలహాలు సూచనలు చేయాల్సిన ఎంఈఓ అడ్రస్ లేకుండా పోయింది. నెల రోజులలో అడపాదడపా వస్తు, వచ్చామా పోయామా అనే తీరు హుస్నాబాద్‌లో నెలకొంది. దీంతో ఎంఈఓ ఆఫీసుకు పలు పనులపై వస్తున్న పేరెంట్స్, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో చాలా సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు స్పందించి హుస్నాబాద్ మండలానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని, లేదంటే ప్రస్తుత ఇంచార్జ్ ఎంఈఓ ను సక్రమంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. హుస్నాబాద్ ఇంచార్జ్ ఎం ఈ ఓ దేశి రెడ్డిని విధుల హాజరుపై ఫోన్ చేయగా స్పందించలేదు.

అధిష్టానం నిర్ణయానికే కట్టుబడి ఉంటాం

- ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి టికెట్ ఇవ్వాలని కొమురెల్లి మల్లన్నకు ముడుపు
- మద్దూరు నుంచి కొమురవెల్లికి బైక్ ర్యాలీ



నవతెలంగాణ-మద్దూరు

జనగామ ఎమ్మెల్యే టికెట్ అధిష్టానం ఎవరికి కేటాయించినా పని చేస్తామని మద్దూరు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశంలు అన్నారు. ఈ సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలో జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి మూడోసారి ఎమ్మెల్యే టికెట్ అధిష్టానం ఇవ్వాలని కోరుతూ మద్దూరు నుంచి కొమురవెల్లి వరకు బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించి కొమురెల్లి మల్లన్నకు ముడుపు కట్టారు అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. సీఎం కేసీఆర్ జనగామ ఎమ్మెల్యే టికెట్‌ను ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి మూడోసారి ఇవ్వాలని కొమురెల్లి మల్లన్న కు ముడుపు కట్టినట్లు వారు తెలిపారు. అధిష్టానం జనగామ ఎమ్మెల్యే టికెట్ ఎవరికీ కేటాయించినా అధిష్టానం ఆదేశాల మేరకు పనిచేస్తామని వారు తెలిపారు. కార్యకర్తలు అయోమయానికి గురి కావద్దని వారు కోరారు. మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి తన వెంట 20 మంది సర్పంచులు గ్రామ శాఖ అధ్యక్షులు తన వెంటే ఉన్నట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. పార్టీతోనే సర్పంచులు గ్రామ శాఖ అధ్యక్షులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మంద సుమన్,కో ఆప్షన్ నెంబర్ ఎండి జిలాని, సర్పంచులు సుందరగిరి స్రవంతి పరశురాములు గౌడ్, బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, జీడి కంటి సుదర్శన్‌లు రవీందర్ రెడ్డి, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్లు చెట్కూరి తిరుపతి, కాసర్ల కనకరాజు, పిఏసి ఎస్ డైరెక్టర్ కొండ అంజయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు దామెర మల్లేశం, పల్లపు వెంకటయ్య, చెవిటి మహేష్, మాజీ సర్పంచ్ అందే భూపతి, మాజీ ఉప సర్పంచ్‌లు నీల బాలకృష్ణ, మల్లారపు రాజు, తదితరులు,పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-మర్కుక్

ఆటో నిబంధనలు తప్పకుండా పాటించాలని, ప్రతి ఒక్క డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ శంకర్ సూచించారు. గురువారం మండల కేంద్రమైన మర్కుక్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధన గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేయవద్దని తెలిపారు. డ్రైవర్ పక్కన కుడి ఎడమల ఎవరిని కూడా ప్యాసింజర్లను కూర్చోబెట్టుకోవద్దని, పరిమితికి మించి ఆటోలో ప్యాసింజర్లను ఎక్కించుకోవద్దని సూచించారు. ఆటోలో సౌండ్ బాక్సులు పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. విధిగా యూనిఫామ్ ధరించి ఆటో నడపాలన్నారు. నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ ఆటోకు ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లు ఉండాలని సూచించారు. ఆటోలను పార్కు చేసేటప్పుడు పార్కింగ్ ప్రదేశాలలో పార్కు చేయాలని రోడ్డుకు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయవద్దన్నారు. ఆటోల అడ్డా వద్ద, పార్కింగ్ ప్రదేశాలు, ఆటోలో ఎక్కిన తర్వాత ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే డయల్ 100 కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ప్రతి ఆటో డ్రైవరు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. నిబంధనలు పాటించని వాహనదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయం



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రజా ఆరోగ్యం విషయంలో సేవ చేయటం మహా భాగ్యమని, ఇది ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అలాంటి మార్గం ఎనుకోవడం అభినందనీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గాడ్ విజన్ సంస్థ గౌరవ అధ్యక్షులు నెలమల్లి సికిందర్ అన్నారు. స్థానిక ఎల్లమ్మ గుడి వద్ద గల క్రీస్తు సంగం చర్చ్‌లో దాదాపు 650మంది క్రైస్తవులకు ముస్తభ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కాన్సేషన్ హెల్త్ కార్డ్‌ను గాడ్ విజన్ పాస్టర్స్ యూనియన్ సిద్దిపేట వారి అధ్వర్యంలో గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్డ్ ద్వారా పేరొందిన దాదాపు 38ఆసుపత్రిలో హైదరబాద్‌లో దాదాపు 30 నుంచి 70 శాతం వరకు తగ్గింపు లభిస్తుందని తెలిపారు. మిగిలిన డబ్బు కు మంత్రి హరీశ్ రావు కృషి తో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వార వస్తుందని, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ కూడ ఎంతో మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించామన్నారు. పేషెంట్లు ఎవరైనా ఆర్థిక ఎబ్బందులలో ఉంటే బజాజ్ ఫైనాన్స్ కంపెనీ ద్వారా వడ్డీ లేని రుణం తీసుకొనే సదుపాయం సంస్థ కలిపిస్తుందని తెలిపారు. ముస్తాబు సంస్థ అధ్యక్షుడు ముస్తఫా అహమద్ మాట్లాడుతూ ఇలాంటి సేవ చేసే అవకాశం దొరకడం నిజంగా తన అదృష్టమన్నారు. ఈ సమావేశంలో మిల్లతే ఇస్లామీయ అధ్యక్షుడు ఖాదర్, పాస్టర్‌లు సాగర్, నాగరాజు, జోషి, పాల్ రాజు, మిళ్లతే ఇస్లామీయ సభ్యులు లడ్డే షరీఫ్, కలీం, జలీల్ ఖాన్ పాల్గొన్నారు.

మోటార్ సైకిల్స్ వెంటనే ఇవ్వాలి

- బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవి కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మోటార్ సైకిల్‌ను వెంటనే ఇచ్చి, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కారం చూపాలని బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిద్దిపేట ఏల్ఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2022 అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలో భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్ ఇస్తామని ప్రకటించారన్నారు. సంవత్సరం దాటిన నేటికీ మోటార్ సైకిల్ సంబంధించిన రూల్స్ రూపొందించలేదన్నారు. వెంటనే విధి విధానాలు రూపొందించి వెల్ఫేర్ బోర్డులో కార్డు ఉన్న కార్మికులందరికీ మోటార్ సైకిల్స్. మహిళా కార్మికులకు స్కూటీస్ అందించాలన్నారు. ఐరిస్ పద్ధతిని పెట్టి కార్మికుల అందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మామిడాల కనకయ్య, మండల భాస్కర్, నాయకులు సత్యం, బాబు, నర్సీవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలు కృషి అభినందనీయం



నవతెలంగాణ-తొగుట

రోదసీరంగంలో భారతదేశం అత్యున్నతమైన మైలురాయిని చేరుకుందని, ప్రపంచంలోని అగ్ర రాజ్యాల సరసన భారత్ నిలిచిందని ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చంద్రయాన్ 3 విజయవంతమైన సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోదసీరంగంలో భారతదేశం అత్యున్నతమైన మైలురాయిని చేరుకుందన్నారు. ప్రపంచంలోని అగ్రరాజ్యాల స్థాయికి చేరుకున్న భారత్ తన సత్తా చాటిందని హర్షం వ్యక్తం చేశారు. చంద్రునిపైకి విక్రమ్ ల్యాండర్ అత్యంత చౌక ఖర్చుతో పంపిన మన శాస్త్రవేత్తల కృషి చాలా గొప్పదని వారి స్ఫూర్తి తో విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెంపొందించుకోవడానికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భగవాన్, మనోజ, శ్రీపాల్, మురళీధర్, మల్లేశం, రామచంద్రం, సుఖేందర్ రెడ్డి, కాత్యాయని దేవి, ఆంజనేయులు, జి.శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్‌తో బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా బీజేపీ నాయకులు మంత్రి హరీశ్ రావు క్యాంపు కార్యాలయం ముట్టడికి గురువారం ప్రయత్నించారు. దీంతో కొంతసేపు పోలీసుల ఆపడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నాయకులను బిజేఆర్ చౌరస్తా వద్ద పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు జన్నపు రెడ్డి సురేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకూ బిజెపి పోరాటం చేస్తుందన్నారు. అదేవిధంగా బిజెపి మహిళా విభాగం అధ్యక్షురాలు గాడి పల్లి అరుణ నేతృత్వంలో మహిళ విభాగం నాయకులు మంత్రి హరీష్ రావు క్యాంపు కార్యాలయం ను ముట్టడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విద్యాసాగర్, వెంకటేశం, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు విజయవంతం చేయాలని మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి తెలిపారు.గురువారం నంగునూరు మండల వనరుల కేంద్రంలో పీఈటీ లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ పోటీలు ఈనెల 28, 29, 30 తేదీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మగ్దుంపూర్ లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని ఉన్నత పాఠశాలల నుండి అండర్ -17, అండర్ -14 స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఇతర వివరాల కోసం నంగునూరు ఉన్నత పాఠశాల పీడీ రాజమౌళిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు రాజమౌళి, శ్రీనివాస్, రాజ్ కుమార్, కవిత, రాజు, రమేష్, సిఆర్పీ పెంటయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు సహకారం

- పేద విద్యార్థుల అభ్యున్నతి లక్ష్యం
- ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్



నవతెలంగాణ-వర్గల్

పేద విద్యార్థుల అభ్యున్నతియే లక్ష్యంగా తాము చదువుకున్న పాఠశాలకు సహకారం అందించాలనే లక్ష్యంతో 'ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్' ముందుకు వచ్చింది. పాఠశాల సమస్యలు తెలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించి వర్గల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులే విద్యనభ్యసిస్తున్నందున తాము చదివిన పాఠశాల, విద్యార్థులకు మేలు చేయాలనే ఉద్దేశ్యాన్ని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర గౌడ్‌ను వారు సంప్రదించగా, విద్యార్థులకు వివిధ సందర్భాలలో అవసరమయ్యే మైక్ సెట్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అత్యవసరంగా ఉన్నట్లు తెలిపారు. దీంతో స్పందించిన పూర్వ విద్యార్థులు రూ.50 వేల విలువచేసే మైక్ సెట్ తదితర వస్తువులను పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సైతం వారు సత్కరించారు. అయితే తాము విద్యనభ్యసించిన పాఠశాలకు కొంతైనా చేయాలనే లక్ష్యంతో ముందుకు వచ్చినట్లు పూర్వ విద్యార్థులు ప్రభుదాస్ గౌడ్, చేపూరి చంద్రమోహన్ గుప్త, సుదర్శన్ గౌడ్, రాజులు గుప్త , సత్యనారాయణ, బాబురావు, లక్ష్మణరావు పేర్కొన్నారు. భవిష్యత్తులో సైతం పేద విద్యార్థుల సంక్షేమానికి తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని ప్రకటించారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతోపాటు విద్యనభ్యసించి ఉన్నత స్థితికి చేరిన పూర్వ విద్యార్థులు ముందుకు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజేషన్ చేయాలి



నవతెలంగాణ-దుబ్బాక

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల్లో మున్సిపల్ కార్మికులు, వాటర్ మెన్ లు,వర్క్ ఇన్‌స్పెక్టర్లు,కంప్యూటర్ ఆపరేటర్లు,జవాన్లు,బిల్ కలెక్టర్లు గా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ గురువారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు.ఔట్ సోర్సింగ్ జేఏసీ నాయకులు బుస్స ప్రవీణ్ కుమార్,మట్టి దిలీప్ కుమార్,శేఖర్ మాట్లాడారు.గత పదిహేనేళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం బాధాకరమన్నారు.తెలంగాణ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ జేఏసీ పిలుపుమేరకు ఈనెల 31 వరకు శాంతియుత నిరసనలు తెలపడం జరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తమ సేవల్ని గుర్తించి వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు.మున్సిపల్ కార్మికులు,ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దుబ్బాక అభ్యర్థికి "కొత్తకు" సన్మానం



తెలంగాణ -దౌల్తాబాద్

మెదక్ పార్లమెంట్ సభ్యులు, సిద్దిపేట బిఆర్ఎస్ అధ్యక్షుడై కొత్త ప్రభాకర్ రెడ్డికి దుబ్బాక అభ్యర్థిగా రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర రావు ఇటీవల ప్రకటించిన సందర్భంగా గురువారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని వంచ రామ్ రెడ్డి కళ్యాణ మండపం లో మండల ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ముఖ్య కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్ గౌడ్ ,వైస్ ఎంపీపీ అల్లి శేఖర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్ సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు పూజిత వెంకటరెడ్డి,కో ఆప్షన్ సభ్యులు హైమద్ , దౌల్తాబాద్ పట్టణ అధ్యక్షుడు ఉమ్మడి నరసింహారెడ్డి గ్రామాల సర్పంచులు చిత్తారి గౌడ్, యాదగిరి, ఎంపీటీసీలు వీరమ్మ మల్లేశం తిరుపతి, టౌన్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్, జనార్దన్ రెడ్డి, నాగరాజు, రవీందర్ రెడ్డి,దండోరా శివరాజ్ , సిద్దిక్ దుర్గేష్, లాలు, కనకయ్య ,వికలాంగుల అధ్యక్షుడు శివంది నర్సింలు ముఖ్య నాయకులు ఉన్నారు,

చంద్రయాన్ విజయంపై బీజేపీ సంబురాలు



నవతెలంగాణ-బెజ్జంకి

ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ విజయవంతమవడంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్ద బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి సంబురాలు జరిపారు. ప్రపంచంలో భారత దేశం అరుదైన విజయాన్ని సాధించిందని..చంద్రయాన్ ప్రయోగంలో అహర్నిశలు పనిచేసి కీలక బాధ్యతలు నిర్వహించిన ఇస్రో శాస్త్రవేత్తలకు బీజేపీ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకులు సంగ రవి, గంప రవి గుప్తా, శీలం వెంకటేశం పాల్గొన్నారు.

మంత్రి ఆశీస్సులు తీసుకున్న సంతోష్ రెడ్డి



నవతెలంగాణ-మర్కుక్: మర్కుక్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, ములుగు డివిజన్ ఆత్మ కమిటి డైరెక్టర్ యావగారి సంతోష్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం మంత్రి హరీష్ రావును కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాన్ని అందజేసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని కలసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి, వంటి మామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కటకం ప్రవీణ్ చారి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిని మహేశ్, బీఆర్ఎస్ పార్టీ మర్కుక్ గ్రామాధ్యక్షులు తడిసిన అజయ్ రెడ్డి, తదితరులున్నారు.

టికెట్ కేటాయింపులో కుర్మలకు స్థానమే లేదు?

కుర్మ యువచైతన్య సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ అసహనం



నవతెలంగాణ-బెజ్జంకి

అధికారమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాష్ట్ర అభ్యర్థుల జాబితాలో కుర్మలకు స్థానమేలేదని కుర్మ యువచైతన్య సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు పెద్దొల్ల శ్రీనివాస్ గురువారం అసహనం వ్యక్తం చేశారు. బీసీ సామాజిక వర్గాలపై బీఆర్ఎస్ పార్టీ అణచివేత దోరణి అవలంభిస్తోందని.. ఇప్పటికైన కుర్మలు చైతన్యవంతులై బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఎస్పీ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించాలని శ్రీనివాస్ కోరారు. బీఎస్పీలోనే బీసీ సామాజిక వర్గాలకు సముచిత స్థానముంటుదని ప్రతి ఒక్కరూ బీఎస్పీలో చేరాలని విజ్ఞప్తి చేశారు.

ఇంద్రమ్మ తోబుట్టు బాండ్ అందజేత



నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 19 వ వార్డుకు చెందిన. అజ్జ అపర్ణ రాజు దంపతులకు తొలి సంతానంలో ఆడబిడ్డ జన్మించిందని తెలుసుకున్న కార్తీక పౌండేషన్ సభ్యులు గురువారం రూ.5 వేల పోస్టల్ ఫిక్సుడు డిపాజిట్ బాండ్ ను అందజేశారు.టిపిసిసి అధికార ప్రతినిధి,ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు కత్తి కార్తీక గౌడ్ తన సొంత ఖర్చులతో నియోజకవర్గంలో తొలి సంతానంలో జన్మించిన ఆడపిల్లల కుటుంబాలకు రూ.5 వేల ఫిక్స్ డిపాజిట్ బాండ్లను అందజేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు కర్ణాల శ్రీనివాసరావు,అశోక్ గౌడ్,ఐరేని సాయితేజ గౌడ్,మల్లేశం పలువురున్నారు.

మైనార్టీలను మోసం చేస్తున్న కేసీఆర్

యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్

నవ తెలంగాణ-గజ్వేల్



మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అధికారంలో వచ్చిన నాలుగు నెలల లోపు అమలు చేసి తీరుతామని కేసీఆర్ రెండు పర్యాయాలు పూర్తి చేసుకున్న రిజర్వేషన్‌పై స్పందించకపోవడం చాలా దారుణం అని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్ ,మిర్జా జమీల్ బేగ్, మున్నాలు ఆరోపించారు. గురువారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ కనీసం బిఆర్ఎస్ పార్టీ రాజకీయాలలో మైనార్టీలకు తక్కువ చూపే చూస్తుందన్నారు. కేవలం ముగ్గురికి ఎమ్మెల్యే సీట్లు కేటాయించి అందులో రెండు ఓడిపోయే తమ మిత్రపక్షమైన పరిధిలో రెండు ఎమ్మెల్యే సీట్లు కేటాయించడం చూస్తేనే మైనార్టీల పట్ల కెసిఆర్ బీఆర్ఎస్ పార్టీకి ఎంత ప్రేమ ఉందో అర్థమౌతుంది అన్నారు.


ఎస్‌జిఎఫ్ గేమ్స్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండల కేం ద్రంలో స్థానిక మండల విద్యాధి . కారి ఉదయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యం లో పాఠశాలల ప్రదనోపాధ్యాయు లు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదేపూర్ మండల ఎస్ జి ఎఫ్ క్రీడల నిర్వహణ కొరకై మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో వచ్చే నెల 2, 4 తేదీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడా పోటీలను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల జగదేవ పూర్‌లో నిర్వహించుటకు తీర్మానించనైనదన్నారు. ఇట్టి క్రీడల్లో పాల్గొనేవారు ఈ నెల 31 తేదీ వరకు ఎమ్ యి ఓ కార్యాలయంలో క్రీడాకారుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్రీడలకు సంబంధించి కార్యదర్శి ఎలేశ్వరరావు మాట్లాడుతూ 14 సంవత్సరాలు లోపు విభాగంలో పాల్గొనే బాల బాలికలు ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలన్నారు. అలాగే 17 సంవత్సరం ల లోపు విభాగంలో పాల్గొనేవారు పదవ తరగతి లోపు చదువుతున్న వారై ఉండాలన్నారు. ఒక క్రీడాకారుడు ఒకే క్రీడలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ విజయ్ కుమార్ ఎమ్ ఎన్ ఓ రహిముద్దీన్ మాధవరెడ్డి, పిఈటిలు రవికుమార్, రజిత, సంఘ నాయకులు శంకర్, వెంకట్రాంరెడ్డి అక్షర పాఠశాల కరెస్పాన్డెంట్స్ రామస్వామి,మాస్టర్ మైండ్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతి విషాదకరం



నవతెలంగాణ-తొగుట

ఎల్లవ్వ మరణంతో వారి కుటుంబంలో విషాదం చోటుచేసుకుందని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కాన్గల్ గ్రామంలో తాగు నీటి కోసం వెళ్లిన మహిళ ప్రమాద వశాత్తు బావిలో పడి మృతి చెందిన విషయంలో తెలుసుకున్న వారు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఎల్లవ్వ మృత దేహాన్ని దర్శించి,కుటుంబ సభ్యులను పరా మర్శించారు.వారిని ఓదార్చారు.ప్రమాద వశాత్తు ఎల్లవ్వ మృతి చెందడం బాధాకరమన్నారు.పరా మర్శించిన వారిలో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోమల కొమురయ్య, సర్పంచ్ ప్రేమల చంద్రారెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మండల ఎంపీ టీసీ ల ఫోరం అధ్యక్షుడు కంకణాల నర్సింహులు, నాయకులు ప్రశాంత్, రాజిరెడ్డి, కర్ణాకర్,వార్డు సభ్యులు స్వామి ఉన్నారు.

అనారోగ్య బాధితునికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆర్థిక సహకారం

నవ తెలంగాణ-సిద్దిపేట

జోగిపేట పట్టణానికి చెందిన నిరుపేద వైశ్యుడు కొడిప్యాక నాగరాజు రక్త కణాల సమస్యతో మందులకు, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విషయం తెలుసుకొని జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వైశ్య నాయకుల సహకారంతో రూ 17,000 ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ జిల్లాలో నిరుపేద ఆర్యవైశ్యులకు సహకారం అందించడమే కాకుండా, వైశ్యేతురులకు సైతం వివిధ రకాల సేవలు జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో చేయడం చాలా సంతోషకరమన్నారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సమాజంలో ఉన్న నిరు పేద వదవులకు పుస్తె మట్టెలు అందించడం జరిగిందని, ఈ మధ్యనే నంగునూరు మండలం నర్మేట గ్రామానికి చెందిన పేద వృద్ధ మహిళ కాలు విరిగి ఆర్థిక సమస్యలతో ఉన్నదని, కోహెడ మండలంలోని విష్ణుకు బ్రేన్ ట్యూమర్‌తో ఇబ్బంది పడుతున్నరని, పోతరెడ్డిపేటకు చెందిన కిడ్నీ బాదితుడు కాశినాథ్‌కు, గుర్రాలగొందికి చెందిన కిడ్నీ బాధితులు బాల్ లింగంకు ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహాసభ కోశాధికారి అత్తెల్లి లక్ష్మయ్య, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మాడిశెట్టి హేమలత, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పుల్లూరి శివకుమార్ , జిల్లా మహిళా విభాగం కోశాధికారి



మార్యాల వాణి, జిల్లా కార్యదర్శి తడకమడ్ల శంకరయ్య , గజ్వేల్ మండల అధ్యక్షులు మర్మాముల ఓంకార్ , జిల్లా వాసవి సేవాదల్ కోశాధికారి చింత రాజేంద్ర ప్రసాద్, సిద్దిపేట డివిజన్ ఛైర్మన్ గంప కృష్ణమూర్తి, జిల్లా వాసవి సేవాదళ్ కార్యదర్శి మార్యాల వీరేశం, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తొడుపునూరి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి



– ఎఫ్డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవ తెలంగాణ -గజ్వేల్

మహిళా సంక్షేమానికి అందులో కార్మిక సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలంగాణ ఫారెస్ట్ ఛైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ లోని క్యాంపు కార్యాలయంలో ప్రజ్ఞాపూర్ లోని కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లేబర్ గుర్తింపు కార్డులను అందజేశారు. మాట్లాడుతూ గతంలోని ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోని పాపాన పోలేదన్నారు, కార్మికులు గురించి గానీ కార్మికుల ఆరోగ్యం పట్ల గాని గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్మికుల ఆరోగ్యం పైన ప్రత్యేక దృష్టి సారించారన్నారు, లేబర్ కార్డు ఉంటే 50 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయించుకునే వసతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులకు ఎన్నో రకాల ప్రోత్సాకాలని కల్పించారన్నారు. కార్మికులు సాధారణంగా మరణిస్తే 1,30,000 రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.అలాగే కార్మికుడు పనిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు మృతి చెందితే 6 లక్షల 30 వేల రూపాయలు వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందిస్తుంది అన్నారు. కార్మికుడి ఆడపిల్ల పెళ్లికి రూపాయిలు 30 వేల ఆర్థిక సహాయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.అలాగే కార్మికుని ఆడపిల్లలకు ప్రసూతి ప్రయోజనాల కింద మొదటి రెండు కాన్పులకు 30000 రూపాయల ఆర్థిక సహాయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. భవన నిర్మాణ కార్మికుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తూ వారికి అండగా ఉంటుందన్నారు లేబర్ కార్డును ప్రతి భవన నిర్మాణ కార్మికుడు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వారు కోరారు. అనంతరం వివిధ పార్టీల నుండి వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో కార్మికులు టిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది వారికి గులాబీ కండువా వేసి పార్టీలో ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నవాజ్ మీరా, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కాజా విరాసత్ అలీ, మూడోవాడు కౌన్సిలర్ మరికంటి కనకయ్య, పుదరి శెంకరయ్య, పోశయ్య, మల్లేశం, లక్ష్మీ నర్సింలు, పూదరి మల్లేశం, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

అబ్ కీ బార్ జవాన్ కిసాన్ సర్కార్

నవతెలంగాణ-బెజ్జంకి

అబ్ కీ బార్..జవాన్ కిసాన్ సర్కార్ నినాదంతో దేశ రక్షణ కోసం వివిధ విభాగాల్లో పనిచేసిన మాజీ సైనికోద్యుగులు తెలంగాణ రాష్ట్రంలో జరుగబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో నిలుస్తారని సకల జనుల పార్టీ వ్యవస్థాపకులు, మాజీ సైనికోద్యోగి రావుల రంగారెడ్డి గురువారం తెలిపారు. మాజీ సైనికుల సంక్షేమాన్ని మరిచిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రానున్న ఎన్నికల్లో హుస్నాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల నుండి రావుల రంగా రెడ్డి, జీ.కృపారావు అబ్ కీ బార్..జవాన్ కిసాన్ సర్కార్ నినాదంతో ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో నిలిచి ప్రజల్లోకి వెళ్లనున్నట్టు రంగారెడ్డి తెలిపారు.రాష్ట్రంలోని అయా నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాను ఈ నెల 27న ప్రకటించనున్నట్టు రంగారెడ్డి పెర్కొన్నారు.

చంద్రయాన్ విజయం దేశానికే గర్వకారణం

నవతెలంగాణ-దుబ్బాక

చంద్రుడి దక్షిణ ధ్రువం పై ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్- 3 విజయవంతమవడం దేశానికే గర్వకారణమని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు కొనియాడారు. చంద్రయాన్ 3 ల్యాండింగ్ ప్రక్రియను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి సోలాపూర్ సౌత్ శాసనసభ్యుడు సుభాష్ సురేష్ చంద్ర దేశ్ముఖ్ తో కలిసి ఎమ్మెల్యే రఘునందన్ రావు తిలకించారు.ఆయన వెంట పలువురు బిజెపి నాయకులు కే.సుభాష్ రెడ్డి, సుంకోజి ప్రవీణ్ కుమార్,అనిల్ రెడ్డి,కార్యకర్తలున్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

నవతెలంగాణ-చేర్యాల

అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేర్యాల మండల కేంద్రంలో గురువారం ప్రతాప్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రం గా ఉన్న చేర్యాల 2009లో కనుమరుగైందని అన్నారు. డివిజన్ కేంద్రం లేక గజ్వేల్, హుస్నాబాద్, సిద్దిపేట లలో డివిజన్ కేంద్రాలు ఉండడం వల్ల అక్కడికి వెళ్లలేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని గత మూడు సంవత్సరాల నుండి కాంగ్రెస్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించామని అన్నారు. స్థానికేతరుడైన ఎమ్మెల్యే చేర్యాల ప్రజల సౌకర్యాలు, అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదన్నారు. రామాయంపేట ను డివిజన్ కేంద్రంగా ప్రకటించిన సీఎం కేసీఆర్ చేర్యాలను రెవిన్యూ డివిజన్ కేంద్రంగా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మిషన్ భగీరథ ప్లాంట్ సందర్శించిన శిక్షణలో ఉన్న నాగాలాండ్ రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్స్ బృందం

నవ తెలంగాణ -గజ్వేల్

నాగాలాండ్ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 20 మంది అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్స్ బృందం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ శిక్షణ లో భాగంగా మిషన్ భగీరథ ప్లాంట్ ను సందర్శించడం జరిగింది. ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయల్ ఐఏఎస్ ఆదేశాల మెరకు మిషన్ భగీరథ ప్లాంట్ ను సందర్శించినారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్య నిర్వాహక ఇంజనీర్ శ్రీ టి.రాజయ్య, అధికారులకు మిషన్ భగీరథ ప్లాంట్ ఉద్దేశం, రూపకల్పన, వాటి పనితిరు, నీటి సరఫరా, నీటి స్వచ్ఛత అమలు చేయు విధానం గూర్చి తెలియజేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ డి ఈ నాగార్జున తదితరులు పాల్గోని అధికారులకు కులంకషంగా వివరించారు. అధికారుల బృందం ఈ పథకాన్ని దాని అమలు వివరించిన అధికారులను కొనియాడారు.

బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరిక

నవ తెలంగాణ - దౌల్తాబాద్

మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బిజెపి బిఆర్ఎస్ పార్టీ యువకులు బుధవారం రాత్రి ఉమ్మడి పౌర సరఫరాల శాఖ మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి తనయుడైన చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలోసుమారు 30 మంది కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారి ఆధ్వర్యంలో దుబ్బాక మండల పరిధిలోని బొప్పాపూర్ లో జరిగిన దుబ్బాక ఆత్మగౌరవ సభలో గ్రామానికి చెందిన నాగ రాజు, స్వామి, మహేష్ ,కరుణాకర్, ప్రశాంత్, భరత్, భరత్, రాజు, ప్రశాంత్, కరుణాకర్, నవీన్, వినీత్ ,సాయికుమార్, నాగరాజు లు కాంగ్రెస్ పార్టీలోకి చేరడం జరిగింది. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో ,బిఆర్ఎస్ లు దొందు దొందే రాష్ట్రంలో ప్రజలను మభ్యే పెట్టే ప్రయత్నం చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తారని ఆయన మండిపడ్డారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను బొంద పెట్టడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గొల్ల కనకయ్య, గొడుగుపల్లి మాజీ ఎంపీటీసీ మద్దెల స్వామి , మండల ఎస్సీ సెల్లు అధ్యక్షుడు బండారు లాలు, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ బాదంశెట్టి భద్రయ్య, లింగం, పంజా రమేష్, నవీన్ ,శివ, యాదవ రెడ్డి తదితరులు ఉన్నారు

సిద్దిపేట అసెంబ్లీ టికెట్ కోసం నాగరాజు యాదవ్ దరఖాస్తు

నవతెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చిన్నకోడూరు మండల అల్లీపూర్ గ్రామా యాదవ్ కులానికి చెందిన మీసం నాగరాజ్ యాదవ్ తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ గాంధీభవన్‌లో గురువారం దరఖాస్తు చేశారు. సిద్దిపేట లోని అంబెడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్ల తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని అన్నారు. రాష్టంలో అధికార పార్టీ చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలే పార్టీని గెలిపిస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణం కోసం 5లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకుంటారన్నారు. అనంతరం హైద్రాబాద్ లోని గాంధీభవన్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్, నాయకులు పర్శరాం, సాయి కుమార్, జయంత్, నర్సయ్య, ప్రశాంత్, జగన్, శేషు,మహేందర్, నరేష్, కుమార్ స్వామి, రాజు, కనకయ్య, బాబు, నాగరాజు, స్వమి, రఘు, మల్లేష్, వినయ్, హరీష్, ఎల్లయ్య శంకర్, ముత్యం, ప్రశాంత్, రాములు, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్వీ నాయకుడు వినయ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం బీఆర్ఎస్వీ నాయకుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువ నాయకుడు, భారత్ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వినయ్ రెడ్డికి శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొండపాక మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్,గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ లో క్రియాశీలకంగా పని చేస్తూ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేస్తూ అందరి మన్నన పొందిన వినయ్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వారికి ఘన సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగిందని అన్నారు. గజ్వేల్ పట్టణంలో పలు దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కన్న,నవాజ్,మిట్టు,అహ్మద్, తండా స్వామి,రాజు,షారుక్, శ్రేయష్, సమీర్, స్వామి, బి ఆర్ ఎస్వీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో చంద్రయాన్ 3 విజయోత్సవ ర్యాలీ

నవ తెలంగాణ దౌల్తాబాద్



ఇస్రో చంద్రయాన్ 3 విజయవంతంగా చందమామపై సురక్షితంగా అడుగు పెట్టిన సందర్భంగా గురువారం మండల పరిధిలోని సూరంపల్లి చిత్రవేద టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణా సంచా కాల్చారు. ప్రధానోపాధ్యాయులు జంగం శంకర్ మాట్లాడుతూ ఇస్రో చేపట్టిన చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడం ప్రపంచానికి భారత్ గర్వకారణం కావడం ఎంతో సంతోషకరమన్నారు. ఇలాంటి ప్రయోగాలు చేసి ప్రపంచంలోనే ప్రథమ స్థానాన్ని నిలబెట్టడంలో భారత్ ముందడుగులో ఉందని ఆయన కోరారు. విద్యార్థిని విద్యార్థులు చిన్నతనం నుండి దేశభక్తిపై మక్కువ ఉండాలని విద్యార్థులను కోరారు. దేశం బాగుంటేనే మనందరం బాగుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవాస్ యోజన విజయవంతం

సూరత్ ఎమ్మెల్యే సుభాష్ చంద్ర దేశముఖ్



నవ తెలంగాణ- దౌల్తాబాద్

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో ప్రవాస్ యోజన సమీక్ష సమావేశం శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు పోతరాజు కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోలాపూర్ సౌత్ ఎమ్మెల్యే సుభాష్ చంద్ర దేశ్ముఖ హాజరయ్యారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దిశ నిర్దేశం కోసం కార్యకర్తలు సైనికులు లాగా పనిచేసే బిజెపి దుబ్బాకలో అధికారంలోనికి రావడం కోసం కంకణ బద్ధులై ముందుకు సాగాలని ఆయన అన్నారు. జిల్లా అధికార ప్రతినిధి కౌకూరి యాదగిరి, బిజెపి మండల ఉప అధ్యక్షుడు గడ్డమీద స్వామి, భూపాల్ రెడ్డి ,రామస్వామి, దేవుడి నరసింహారెడ్డి, కొత్త సురేందర్ రెడ్డి, నర్సింలు, చింటూ

హరీశ్‌ను విమర్శించడం సిగ్గుచేటు

నవ తెలంగాణ గజ్వేల్ : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావును ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు విమర్శించడం సిగ్గుచేటు అని విద్యార్థి విభాగం గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి నూనె కుమార్ యాదవ్ అన్నారు. గురువారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వార్థ వ్యక్తిగత కుటుంబ ప్రయోజనాల కోసం రోజుకు 18 గంటలు ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసే మంత్రివర్యులు హరీష్ రావు పైన చేసిన నికృష్ట వ్యాఖ్యలు వెనుకకు తీసుకొని వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలోనైనా, నేడు తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలోనైనా శక్తి సామర్థ్యాల మేర కృషి చేస్తున్న పరిస్థితి తెలంగాణ సమాజానికి తెలుసునన్నారు. హరీష్ రావు పని విధానం పట్ల నిండు శాసనసభలో ప్రతిపక్ష నాయకులు సైతం హరీష్ రావు పనితనాన్ని గొప్పగా అభినందించడం జరిగిందని తెలిపారు. మైనంపల్లి హనుమంతరావు నీ గత చరిత్ర ఏందో ప్రజలకు తెలుసని ఆయన అన్నారు. ˇహవత్ తెలంగాణ రాష్ట్రంలో హరీష్ రావుకు అభిమానులు ఉన్నారని, రాష్ట్రంలో ఉన్న హరీష్ రావు అభిమానులంతా ఒకసారి కళ్ళు తెరిస్తే నీ జాడ దొరకడం కష్టమని ఆయన చెప్పారు.

రాజీ మార్గమే ఉత్తమం

సెప్టెంబర్ 9న మోగా లోక్ అదాలత్‌లో వీలైనంతం ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి
జిల్లా ఎస్పీ ఎం.రమణ కుమార్

నవతెలంగాణ-సంగారెడ్డి



రాజీ మార్గమే ఉత్తమమని, సెప్టెంబర్ 9న నిర్వహించే మోగా లోక్ అదాలత్‌లో వీలైనంత ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఎం.రమణకుమార్ అన్నారు. గురువారం మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్‌లో భాగంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశానికి ఎస్పీ ఎం.రమణకుమార్, అదనపు ఎస్పీ పి.అశోక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ (అండర్ ఇన్వెస్టిగేషన్)లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏవిధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలనే విషయాలపై సలహాలు, సూచనలు చేశారు. ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తమ తమ పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల ఆన్లైన్, మోసాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరంతరం ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఆన్లైన్మో మోసాలు, లాటరీల పేరిట జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసర లింక్‌లు ఓపెన్ చేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లైతే వెంటనే 1930 నెంబర్ కు ఫిర్యాదు చేయాలన్నారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ వర్టికల్ పనితీరులో మెరుగైన ప్రదర్శన కనబరిచి, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను పరిమిత లిమిట్స్‌లో ఉంచినందుకుగాను ఎస్.హెచ్.ఒ.లను అభినందించారు. ఆయా వర్టికల్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన అధికారులకు, సిబ్బందికి రివార్డులు అందిస్తామన్నారు. జిల్లాలో నేరాల అదుపునకు తమతమ సబ్-డివిజన్‌లలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని డీఎస్పీలకు సూచించారు. నేర నియంత్రణలో సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ, స్వచ్ఛందంగా వారి గ్రామ ప్రధాన కూడళ్లల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. నేరాల నియంత్రణతో పాటు దర్యాప్తు ఛేదనకు దోహదపడే సి.సి కెమెరాల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ప్రజాప్రతినిధులు వ్యాపారస్తులు వివిధ కుల సంఘాలవారు ముందుకు రావాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. హైవేలు, ప్రధాన కూడళ్లలో, పార్కింగ్ ప్రాంతాలలో, పెట్రోల్ పంపులలో, ధాబా లలో సి.సి. కెమెరాల ఏర్పాటు చేసుకునెలా సంభందిత యజమానులకు తెలియజేయాలని ఎస్.హెచ్.ఒ. లకు సూచనలు చేశారు. సమావేశంలో రమేష్ కుమార్ డియస్పి సంగారెడ్డి, పురుషోత్తం డియస్పి పటాన్ చెరు, రఘు డియస్పి జహీరాబాద్, వెంకట్ రామ్ రెడ్డి డియస్పి నారాయణఖేడ్. శివలింగం యస్.బి ఇన్స్పెక్టర్, బి.రమేష్ ఇన్స్పెక్టర్ డీసీఆర్బీ. జిల్లా సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకం

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజాస్వామ్యం పటిష్టంగా ఉండాలంటే కీలకమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి నగేష్ అన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వయోవృద్ధులకు ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమైనదని, ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటింగ్ లో పాల్గొనాలన్నారు. ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అనేక మార్పులు చేపడుతూ, వివిధ రకాల సదుపాయాలను అందుబాటులోకి తెస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నచ్చిన వ్యక్తికే ఓటు వేసే అవకాశము ఉందన్నారు. సెప్టెంబర్ 19 వరకు మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని, అన్ని పోలింగ్ కేంద్రాలలో ముసయిదా ఓటరు జాబితాలు అందుబాటులో ఉన్నాయని,తమ పేరు జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. అపార అనుభవం గల వయోవృద్ధులు తమ చుట్టుపక్కల గల యువతకు ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, ఓటరుగా నమోదయ్యేలా చైతన్య పరచాలని కోరారు.ఓటు రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని, ఓటును మించిన ఆయుధం లేదని,దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఎనభై ఏళ్ళు పైబడిన వయోవృద్ధులు, దివ్యంగులు తమ ఇంటి నుండే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును కల్పించిందని వివరించారు. వయోవృద్ధులు ఓటింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, వీల్ చైర్, త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై అనుమానాలను నివృత్తి చేసారు. ఈవీఎం, వివి ప్యాట్ ల డెమో చేసారు. ఓటింగ్ చేయడం, వేసిన ఓటును చెక్ చేసుకోవడం పై మాక్ పోలింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పలువురు వయోవృద్ధులు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం వయోవృద్ధులకు సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించారు. స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి సంధ్యారాణి, నారాయణఖేడ్ ఆర్డిఓ వెంకటేష్, కలెక్టరేట్ ఏఓ పరమేశ్వర్, వయోవృద్దులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలకు మహాతి విద్యానికేతన్ విద్యార్థులు



నవ తెలంగాణ- గజ్వేల్

రాష్ట్ర స్థాయి టార్గెట్ వాలీబాల్ పోటీలకు మహతి విద్యా కేతన్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీలు తిరుపతి, శ్రీకుమార్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాల క్రీడారంగంలో పై చేయి సాధిస్తుందని వారు తెలిపారు. ఇప్పటివరకు అనేక క్రీడారంగంలో పాల్గొని మంచి పట్టు పథకాలు సాధించినట్లు వారు చెప్పారు. మహతి విద్యానికేతన్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చదువుతోపాటు క్రీడారంగంలో మంచి శిక్షణ ఇస్తున్నట్లు వారు చెప్పారు. ఇందులో భాగంగా గజ్వేల్ మండలంలోని మహతి విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు కార్తీక,వినూత్న, అర్చన,అశ్విని, అమాన్, వరుణ్, టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని పీయిటీలు తెలిపారు. వీరు 26-08-2023 నుండి 27-08-2023 వరకు వరంగల్ లో జరగబోయే రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ పీ.గోపినాథ్ శర్మ ప్రధానోపాధ్యాయులు షబానా ముంతాజ్ ,వైస్ ప్రిన్సిపల్ శశిదర్ శర్మ అభినందంచారు.

కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఉత్తర ప్రదేశ్ ఎమ్మెల్సీ అవినీష్ కుమార్ సింగ్ పటేల్

నవతెలంగాణ-సంగారెడ్డి



కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉత్తర ప్రదేశ్ ఎమ్మెల్సీ అవినీష్ కుమార్ సింగ్ పటేల్ అన్నారు. గురువారం సంగారెడ్డి బిజెపి కేంద్ర పార్టీ చేపట్టినటువంటి అసెంబ్లీ ప్రవాస్ భారత్ యోజన కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు రవి శంకర్ అధ్వర్యంలో జరిగిన పట్టణ శాఖ సమావేశంలో సంగారెడ్డి అసెంబ్లీకి విచ్చేసిన ఉత్తర ప్రదేశ్(లక్నో)ఎమ్మెల్సీ అవినీష్ కుమార్ సింగ్ పటేల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. సంగారెడ్డి పట్టణంలో, బూత్ స్థాయిలో బిజెపి పార్టీనీ ఎలా బల పర్చాలో కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేవా అని తెలుసుకొని దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొండపురం జగన్,హనుమత్ రెడ్డి, రాములు,నాయకోటి రమేష్, కసినివాసు,మందుల నాగరాజు, అశ్వంత్, మురళీధర్ రెడ్డి,పట్టణ కార్యవర్గం, పట్టణ నాయకులు,కార్యకర్తలు, శక్తి కేంద్ర ఇంచర్జులు, బూత్ అధ్యక్షులు సమావేశం పాల్గొన్నారు.

కొండపోచమ్మ సాగర్‌ను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-మర్కుక్ :సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో గల కొండపోచమ్మ సాగర్‌ను జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ గురువారం సంద ర్శించారు. అనంతరం కర్కపట్ల, దామరకుంట గ్రామాలలోని నర్సరీ లను, పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు. దామరకుంట పాఠశాలను, జెపిఎస్‌ల రికార్డులను డీఏల్పివో వేదావతి, మర్కుక్ ఎంపివో రాజాలింగంతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి బాస్కర్, కర్కపట్ల, దామరకుంట సర్పంచులు గాజే నర్సింలు, గాయత్రి బాలనర్సయ్య, కొండపోచమ్మ సాగర్ ఇంజనీర్ శ్రావణ్ డా.శ్రీనివాస్, వివిధ గ్రామ పంచాయితీ కార్యదర్శులు మౌన, రేఖా, రోజా, తదితరులున్నారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శించిన కత్తి కార్తిక గౌడ్ బృందం

నవ తెలంగాణ-దౌల్తాబాద్



సాక్షి దినపత్రిక జర్నలిస్టు గొల్లపల్లి నగేష్ తండ్రి గొల్లపల్లి లింగయ్య అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తిక ఆదేశాల మేరకు గురువారం వారి కుటుంబ సభ్యులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్నల్ శ్రీనివాసరావు, మిద్దె భూపాల్ గౌడ్ (సిద్దిపేట జిల్లా సేవాదళ్ కార్యదర్శి), అశోక్ గౌడ్, దొమ్మాట మాజీ ఎమ్మెల్యే ఐరేని లక్ష్మయ్య మనుమడు ఐరేని సాయితేజ గౌడ్, పెంటం దేవరాజు, యాదగిరి , మల్లేశం, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.